తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

## కాణిపాకం బ్రహ్మోత్సవ ఆదాయం రూ.2.43 కోట్లు



కాణిపాకం, అక్టోబర్ 9 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో జరిగిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా 2.43 కోట్లు రూపాయలు ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వెంకటేశు ఒక ప్రకటనలో తెలిపారు దేవస్థానంలో గత నెల 18 నుండి ఈనెల 8 వరకు 21 రోజుల పాటు జరిగిన స్వామివారి బ్రహోత్సవాల సందర్భంగా 2,42,55,774 రూపాయాలు వచ్చినట్లు తెలిపారు. ఇందులో భాగంగా భక్తుల దర్శనాల ద్వారా 87.08 లక్షలు, విరాళాల ద్వారా 34.59 లక్షలు, ప్రసాదాల విక్రయాల ద్వారా 90.48 లక్షలు, సేవల ద్వారా 17.56 లక్షలు, వసతి గృహాల అద్దె ద్వారా 9.10 లక్షలు, కళ్యాణ కట్ట ద్వారా 3.75 లక్షల రూపాయలు ఆదాయంగా వచ్చినట్లు ఈఓ వెంకటేశు తెలిపారు.

## ఇస్రో ప్రదర్శనలకు విశేష ఆదరణ

### - చంద్రయాన్-3 విజయమే కారణం




శ్రీహరికోట (తడ), అక్టోబర్ 9 ప్రభాతవార్త ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు-2023లో ఇస్రో అధికారులు, శాస్త్రవేత్తలు ఏర్పాటు చేసిన ప్రదర్శనలకు విశేష ఆదరణ లభించింది. ఇటీవల చంద్రయాన్-3 ప్రయోగం విజయం తర్వాత దేశంలోని దశదిశలా ఇస్రో శాస్త్రవేత్తల ప్రతిభను కీర్తిస్తున్నారు. ఇందుకు తగ్గట్లే ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలలో రాకెట్లు, ఉపగ్రహాల నమూనాల ప్రదర్శనలతో పాటు చంద్రయాన్-3 సాఫ్ట్ ల్యాండింగ్ ప్రదర్శన, నమూనా, దాని గురించిన సమాచారంపై విద్యార్థులు అమిత ఆసక్తిని ప్రదర్శించారు. సోమవారం శ్రీహరి కోటలో పలు అంతరిక్ష ప్రదర్శన శాలలను విద్యార్థులు వీక్షించారు. మంగళవారం ముగింపు రోజున విశ్రాంత సైన్స్ అండ్ టెక్నాలజి శాఖ అధికారి రామస్వామి ముఖ్య అతిథిగా వచ్చి షార్‌లో విజేతలకు బహుమతులు పంచిపెట్టనున్నారు. అదేరోజు మధ్యాహ్నం ఆర్ఎక్స్ 200 సౌండింగ్ రాకెట్‌ను ప్రయోగించనున్నట్లు షార్ అధికారులు తెలిపారు.

## అలిపిరిలో అనునిత్యం శ్రీనివాస హోమం

### శ్రీనివాసా సొసైటీ క్రింద మెరుగైన సేవలు
### టిటిడి ధర్మకర్తల మండలి సమావేశంలో ముఖ్య నిర్ణయాలు



తిరుమల, అక్టోబర్ 9, ప్రభాతవార్త ప్రతినిధి

టిటిడి ధర్మకర్తల మండలి అధ్యక్షులు భూమన కరుణాకర్ రెడ్డి అధ్యక్షతన సోమవారం తిరుమల అన్నమయ్య భవనంలో ధర్మకర్తల మండలి సమావేశంలో నిర్వహించారు. తిరుపతిలోని అలిపిరి వద్ద గల సప్తగోప్రదక్షిణ మందిరంలో అనునిత్యం శ్రీ శ్రీనివాసా దివ్యానుగ్రహ విశేష హోమం నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. టిటిడి కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీల కింద విధులు నిర్వహిస్తున్న దాదాపు 5 వేల మంది ఆరోగ్యశాఖలోని కాంట్రాక్టు పారిశుద్ధ్య కార్మికులు, ఎఫ్ఎంఎస్ పారిశుద్ధ్య కార్మికుల వేతనాన్ని రూ. 12 వేల నుండి రూ. 17 వేలకు పైగా పెంచేందుకు ఆమోదం, మున్సిపాలిటీల్లో విధులు నిర్వహిస్తున్న పారిశుద్ధ్య కార్మికులతో సమానంగా ఈ వేతనం పెంపుఉటుందన్నారు. లక్ష్మీ శ్రీనివాసా మ్యాన్ పవర్ కార్పొరేషన్ ద్వారా తిరుమల తిరుపతి దేవస్థానంలో పనిచేస్తున్న ఉద్యోగస్తులకు ఇంత వరకు వారి వేతనాలలో ప్రతి సంవత్సరం ఎటువంటి పెరుగుదల ఇవ్వటం జరగలేదు. దాని పర్యవసానంగా ఈ ఉద్యోగస్తుల వేతనాలు గత కొన్ని సంవత్సరాలుగా ఒకే రకంగా ఉన్నాయి. ఉద్యోగస్తులను ప్రోత్సహించడంలో భాగంగా వారి వేతనాలలో ఇక నుంచి ప్రతి సంవత్సరం 3 శాతం వేతనం పెంచేందుకు ఆమోదం. తద్వారా దాదాపు 6600 మంది ఉద్యోగస్తులకు లబ్ధి చేకూరుతుంది. అలిపిరిలో ప్రస్తుతం 130 వాహనాలను పార్క్ చేసేందుకు 2.47 ఎకరాలు మాత్రమే అందుబాటులో ఉంది. రోజురోజుకు పెరుగుతున్న యాత్రికల సంఖ్యను దృష్టిలో ఉంచుకుని అదనంగా మరో 156 బస్సులు, 683 కార్లు, జీపులు, 1325 ద్విచక్రవాహనాలు పార్కింగ్ చేసుకునే విధంగా 7 అదనపు టాయ్‌లెట్లు, యాత్రికులు వంట చేసుకునేందుకు అనువుగా మూడు షెడ్లు నిర్మాణానికి మరో 11.34 ఎకరాలు అభివృద్ధి చేసి, ఇక్కడ బిటి రోడ్లు, భూదేవి కాంప్లెక్సు వద్ద దర్శన టికెట్లు పొందే భక్తులకు క్యూలెన్లు, లైటింగ్ తదితర వసతులు కల్పించేందుకు రూ. 21.60 కోట్లతో పరిపాలన అనుమతికి ఆమోదం. ఈ సమావేశంలో టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి, దేవాదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాలవలవన్, కమిషనర్ సత్యనారాయణ, జేఈఓలు సదాభార్గవి, వీరబ్రహ్మం, బోర్డు సభ్యులు పాల్గొన్నారు.

## చిత్తూరు వైకాపాలో ఆధిపత్య పోరు

### ఎమ్మెల్యే వర్సెస్ ఆర్టీసీ వైస్ చైర్మన్

చిత్తూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త: అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తుండటంతో చిత్తూరు నియోజకవర్గ అధికార వైకాపాలో ఆధిపత్య పోరు రచ్చకెక్కుతుంది. చిత్తూరు వైకాపాలో నిన్నటి వరకు ఇరు వర్గాల మధ్య అంతర్గత పోరు కొనసాగుతుండగా ప్రస్తుతం ఈ వ్యవహారం డిప్యూటీ మేయర్‌తో పాటు మరో ముగ్గురు కార్పొరేటర్లపై సస్పెన్షన్ వేటు వేయడానికి షోకాజ్ నోటీసుల జారీ వరకు వెళ్ళడంతో ఇరు వర్గాల పోరు బహిర్గతం అయ్యింది. చిత్తూరు నుండి అధికార వైకాపా తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రస్తుతం ప్రాతినిధ్యం వహిస్తున్నారు. రానున్న ఎన్నికల్లో మళ్ళీ తనకే పార్టీ అధిష్టానం అభ్యర్థిత్వం కేటాయిస్తోందని సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు గట్టి నమ్మకంతో వున్నారు. జిల్లా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సైతం తన అభ్యర్థిత్వం ఖరారుకు పూర్తి సహకారం అందిస్తారని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు భావిస్తున్నారు. ఈ క్రమంలో చిత్తూరు ఎమ్మెల్యే అభ్యర్థిత్వంపై కన్నేసిన ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి గత మూడు సంవత్సరాలుగా చిత్తూరు నియోజకవర్గ పరిధిలో తన సొంత నిధులతో పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల్లోకి వెళ్తున్నారు. గతంలో జరిగిన మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సైతం ఆర్టీసి వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, రాష్ట్ర మొదలియార్ కార్పొరేషన్ చైర్మన్ బుల్లెట్ సురేష్‌లు కలిసి చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 33 డివిజన్లు ఏకగ్రీవం చేశారు. మెజార్టీ కార్పొరేటర్లను ఏకగ్రీవం చేయడంతో తాము సూచించే అభ్యర్థికి మేయర్ కుర్చీ ఇవ్వాలని అప్పట్లో ఆర్టీసీ వైస్ చైర్మన్ ప్రతిపాదన పెట్టారు. ఈ మేరకు మేయర్ అభ్యర్థిగా పుంగోడిని తెరపైకి తెరమీద తీసుకువచ్చారు. అయితే ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పట్టుబట్టి తమ వర్గానికి చెందిన అముదను మేయర్ కుర్చీలో కూర్చొబెట్టుకొన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లో ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డికి 28 కార్పొరేటర్లు ప్రస్తుతం అండగా నిలుస్తున్నట్లు సమాచారం. ఈ క్రమంలో క్షేత్ర స్థాయిలో సమస్యలు పరిష్కరించడానికి గడప గడపకు ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించిన ప్రభుత్వం ఒకొక్క డివిజన్‌కు 30 లక్షల రూపాయల మేరకు పనులు మంజూరు చేశారు. ఈ నిధులతో పనులు చేపట్టడానికి కార్పొరేటర్లు సిద్దమైన నేపథ్యంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు రంగంలోకి దిగి చిత్తూరు నగరంలో ప్రధానంగా వున్న మూడు సమస్యలను పరిష్కరించడానికి డివిజన్లతో నిమిత్తం లేకుండా ఒకొక్క డివిజన్ 15 లక్షల రూపాయలు ఇవ్వాలని చెప్పి ఈ మేరకు పనుల ప్రతిపాదనలు చేపట్టి రెండు రోజుల క్రితం జరిగిన కార్పొరేషన్ సమావేశంలో కార్పొరేటర్లతో తీర్మానం చేశారు. దీనిపై ప్రారంభంలో అత్యధిక కార్పొరేటర్లు ఆగ్రహించినప్పటికీ ఎమ్మెల్యే దీని వెనుక మంత్రి హస్తం వుందని చెప్పి మెజార్టీ కార్పొరేటర్లతో పనులకు ఆమోద ముద్ర వేసుకొన్నారు. ఈ క్రమంలో సమావేశంలో మేయర్ అముదను సమావేశం నిర్వహించకుండా అడ్డుకొన్నారని, మేయర్ పోడియం వైపుకు వెళ్ళి ఆమెను నిర్బందించడంతో డిప్యూటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డితో పాటు కార్పొరేటర్లు ఆర్‌జి శ్రీకాంత్, ఇందు, వెంకటరమణలకు డిసిసి అధ్యక్షుడు, ఎమ్మెల్సీ భరత్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. షోకాజ్ నోటీసులు అందుకొన్న డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు ఇక రెండు రోజుల్లో సంతృప్తికర సమాధానం ఇవ్వకుంటే వారిపై డిసిసి అధ్యక్షుడు క్రమశిక్షణా చర్యలు తీసుకొనే అవకాశాలు కన్పిస్తున్నారు. ఎన్నికలు సమీపిస్తుండటంతో వైకాపా వర్గ విబేధాలు రచ్చకెక్కడంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో కలవరం నెలకొంది.

## సైకో కిల్లర్ అరెస్ట్, కత్తి స్వాధీనం

తిరుపతి క్రైం, అక్టోబర్ 9, ప్రభాతవార్త



తిరుమల శ్రీవారి దర్శనం చేసుకుందామని భార్య, బావమరిదినీ పిలిచి దారుణంగా హత్య చేసిన సైకో కిల్లర్‌ని అలిపిరి పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం తిరుపతి డిఎస్పి సురేందర్ రెడ్డి అలిపిరి సిఐ అబ్బాన్నతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించి నిందితుడు వివరాలను వెల్లడించారు. మహారాష్ట్ర నాందేడ్ నవజీవన్ నగర్‌కు చెందిన యువరాజ్ సాంబాజీ నార్వాడే సుమారు 12 సంవత్సరాల క్రితం మనిషా వివాహం చేసుకున్నాడు. వీరికి మూడు సంవత్సరాలు, ఆరు సంవత్సరాలు ఇద్దరు కుమారులు ఉన్నారు. చిన్న కుమారుడు బాల్యం నుంచే అంగవైకల్యంతో ఉన్నాడు. యువరాజ్ సాంబాజీ నార్వేడ్ కూలి పని చేసుకుంటాడు. సంపాదించిన డబ్బుతో జల్సాలు చేసేవాడు. అంగవైకల్యంతో బాధపడుతున్న కుమారుడికి వైద్యం చేపించేవాడు కాదు. ఈ క్రమంలో ఇంటి స్థలం విక్రయించటంతో 40 లక్షల రూపాయిలు వచ్చాయి. యువరాజ్ నగదును చెడు వ్యసనాలకి ఖర్చు చేస్తుండటంతో భామ్మర్ది హర్షవర్ధన్ కైలాష్ దుధ్మల్ ప్రశ్నించేవారు. తన జోలికి వస్తే చంపేస్తానని బెదిరించి సంవత్సర కాలంగా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. భార్య, బావమరిది ఫోన్ చేసి తమ కష్టాలను చెబుతున్నప్పుడు వీరిని అంత మెందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ నేపథ్యంలో తిరుమల శ్రీవారి దర్శనం చేసుకుని మన ఊరి వెళ్తామని భార్యకి మాయమాటలు చెప్పి తిరుపతికి రప్పించాడు. ఈ నెల 5న తిరుపతికి చేరుకున్న భార్య, బావమరిది, పిల్లలను హోటల్‌కి తీసుకువెళ్లాడు. పథకం ప్రకారం అర్ధరాత్రి సమయంలో బావమరిది హర్షవర్ధన్ కైలాష్ దుధ్మల్‌ను (25) కిరాతకంగా కత్తితో నరికాడు. తర్వాత భార్యని మనిషా (23) కూడా కత్తితో నరికి దారుణంగా హత్య చేసి పరారయ్యారు. హోటల్ మేనేజర్ పవన్ కుమార్ ఫిర్యాదుతో సిఐ అబ్బున్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సోమవారం అన్నమయ్య సర్కిల్ వద్ద నిందితుడిని సిఐ అబ్బున్న ఎస్ఐ ఇమ్రాన్ భాష అరెస్టు చేశారు. రిమాండ్‌కి తరలిస్తున్నట్లు డిఎస్పి తెలిపారు. కేసు ఛేధించడంలో ప్రతిభ కనబరిచిన సిఐ అబ్బున్న ఎస్ఐ ఇమ్రాన్ భాషని డిఎస్పి అభినందించి రివార్డులు అందజేసారు.

## పవిత్రోత్సవాలకు వైభవంగా అంకురార్పణ





వడమాలపేట, అక్టోబరు 9 ప్రభాతవార్త: అప్పలాయగుంటలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయంలో పవిత్రోత్సవాల సందర్భంగా సోమవారం సాయంత్రం అంకురార్పణ కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. మాడవీధుల్లో మేళతాళాలలతో ఊరేగింపుగా సేనాధిపతి ఉత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పుట్టమట్టిని ఆలయం నుంచి ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకొచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు సూర్యకుమారాచార్యులు, వేదపండితులు పుట్ట మట్టిని మేదినీదేవి రూపంలో అలంకరింపచేసి, మంగళ హారతులు ఇచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ మహా గోపురం వద్ద వేదమంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ అంకురార్పణ గావించారు. కార్యక్రమంలో ఆలయ అధికారి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టిటిడి ట్రస్టులకు రూ. 31 లక్షలు విరాళం



తిరుమల, అక్టోబర్ 9, ప్రభాతవార్త ప్రతినిధి

టిటిడి ఎస్వీ ప్రాణదాన ట్రస్టుకు రాజమంత్రికి చెందిన డాక్టర్ నారాయణ రాజ్ రూ. 11 లక్షల 11 వేల 116 పశ్చిమగోదావరికి చెందిన వెన్న హరిబాబు ఎస్వీ అన్న ప్రసాదం ట్రస్టుకు రూ. 10 లక్షలు సోమవారం విరాళంగా అందించారు. అదే విధంగా ముంబైకి చెందిన ప్రముఖ గాయని లతా మంగేష్కర్ వీలునామ మేరకు, వారి సోదరి ఉషా మంగేష్కర్ రూ. 10 లక్షలు టిటిడి ట్రస్టులకు అందించారు. ఇందుకు సంబంధించిన డిడిని తిరుమల అన్నమయ్య భవనంలో టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డికి దాతలు అందజేసారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు శేషుబాబు, మిలింద్ నర్వేకర్ తదితరులు పాల్గొన్నారు.

## స్పందనకు 386 అర్జీలు



ప్రజల నుండి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ సగిలి షన్మోహన్

చిత్తూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త: ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతి సోమవారం కలెక్టర్ సగిలి షన్మోహన్ ఆధ్వర్యంలో నిర్వహించే స్పందన కార్యక్రమంకు ఈ వారం జిల్లా నలుమూలల నుండి సమస్యలపై అధికారులకు 386 అర్జీలు అందాయి. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన స్పందన కార్యక్రమానికి కలెక్టర్ సగిలి షన్మోహన్ హాజరై ప్రజల నుండి సమస్యలపై అర్జీలు స్వీకరించి వాటిని సత్వరం పరిశీలించి పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ రాజశేఖర్, జడ్పీ సిఇఓ ప్రభాకర్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## స్పందన అర్జీలకు పరిష్కారం చూపాలి

### జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి



ప్రజల వద్ద నుంచి అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 9, ప్రభాతవార్త

స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కారం చూపాలని జిల్లా కలెక్టర్ వెంకటరమణా రెడ్డి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో ఎస్‌డిసిలు, జిఎన్ఎస్ఎస్ కోదండరామిరెడ్డి, ఏపిఐఐసి శ్రీనివాసులు, ప్రోటోకాల్ భాస్కర్ నాయుడుతో కలిసి స్పందన గ్రీవెన్స్ అర్జీలను స్వీకరించారు. వీరితో పాటు కలెక్టరేట్ ఎఓ జయరాములు జిల్లాలో వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. స్పందన ఆన్‌లైన్ నమోదుతో రసీదులు అందించారు. శాఖల వారీగా 251 వినతులు రావడం జరిగిందని జిల్లా అధికారులు వచ్చిన అర్జీలను సకాలంలో పరిష్కరించాల్సిందిగా స్పందనకు హాజరైన వివిద శాఖలకు సంబంధించిన జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

## ఎమ్మెల్సీ భరత్‌పై పోలీసులకు తెలుగు మహిళల ఫిర్యాదు

### - ఫేస్‌బుక్‌లో అనుచిత వ్యాఖ్యలు పోస్ట్ చేశారని ఆందోళన !!

కుప్పం, అక్టోబర్ 9 ప్రభాతవార్త

ఎమ్మెల్సీ, చిత్తూరు జిల్లా వైఎస్సార్సీ అధ్యక్షుడు భరత్‌పై కుప్పంకు చెందిన మాజీ ఎంపిటిసి శారదమ్మ, తెలుగుమహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు అనసూయ, తెలుగుమహిళ నేతలు ఎస్పి శివకుమార్‌కు ఫిర్యాదు చేశారు. ఈనెల 6వతేది తాము తెదేపా అధినేత చంద్రబాబునాయుడు అరెస్ట్‌ను ఖండిస్తూ అమ్మవారి వేషధారణధరించి చంద్రబాబుకు న్యాయం జరిగేలా చూడాలని నిరసన దీక్షలో పాల్గొన్నామయన్నారు. అయితే తమ నిరసనను, తమను అగౌరవ పరిచేలా ఎమ్మెల్యేస భరత్ తన ఫేస్‌బుక్ ఖాతాలో తమ పట్ల అనుచిత వ్యాఖ్యలు పోస్ట్ చేశారని పేర్కొన్నారు. తమ వీడియోను జతపరచి తామంతా పెయిడ్ ఆర్టిస్టులు అని అలాగే త్రాగిన మత్తులో ఊగుతున్నారని వ్యాఖ్యలు చేయడం చాలాబాధాకరమన్నారు. సోషియల్ మీడియా వేదికగా మహిళల మనోభావాలు దెబ్బతీసేలా తమపై పోస్టులు పెట్టిన ఎమ్మెల్సీ భరత్‌పై క్రిమినల్ కేసు నమోదు చేయాలని, ఎమ్మెల్సీ భరత్ తమకు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కాగా తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు అనసూయ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ కోసం తాము తమ సొంత డబ్బులు పెట్టుకుని పనిచేస్తున్నామని అయితే ఎమ్మెల్సీ భరత్ తమను పెయిడ్ ఆర్టిస్టులు అంటూ అలాగే తాగి ఊగుతున్నారనే వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. సమాజంలో ఉన్న మహిళలకు ఓ గౌరవప్రదమైన పదవిలో ఉన్న వ్యక్తి ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ఫేస్‌బుక్‌లో అనుచిత వ్యాఖ్యలు పోస్ట్ చేయడంతో తాము తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నామని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో తెలుగు మహిళా నేతలు వసంతమ్మ, సుగుణమ్మ, జయమ్మ, తిరుమగళ్, స్వాతి, చంద్రకళ, పుష్ప, శకుంతల, దొరసాని తదితరులు పాల్గొన్నారు.



కుప్పం ఎస్పికు ఫిర్యాదు చేస్తున్న తెలుగు మహిళ నేతలు

### అది ఎమ్మెల్సీ భరత్ ఫేస్‌బుక్ ఖాతాకాదు.. నకిలీది

ఎమ్మెల్సీ, జిల్లా వైకాపా అధ్యక్షుడు భరత్ తమను ఫేస్‌బుక్‌లో కామెంట్లు చేశారని తెలుగుదేశం మహిళలు పోలీసులకు ఫిర్యాదు చేశారని అయితే ఆ ఫేస్‌బుక్ ఖాతా ఎమ్మెల్సీ భరత్‌ది కాదని కుప్పం ఎమ్మెల్సీ క్యాంప్ కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. తెలుగుదేశం మహిళా నేతలు నిజానిజాలు తెలుసుకుని ఫిర్యాదులు చేయాలని ఫేస్‌బుక్‌లో కెఆర్‌జెభరత్‌అఫిషియల్ అనే ఐడి మాత్రమే ఒరిజినల్ అని మిగతా అధికారిక మాధ్యమ ఖాతాలు లేవని ఇప్పటికే నకిలీ ఖాతాలు తొలగించాలని ఫేస్‌బుక్, సైబర్ క్రైమ్ వారిని ఆశ్రయించినట్లు తెలిపారు. ఎమ్మెల్సీ భరత్‌పై అసత్య ఆరోపణలు, ఫిర్యాదులు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోనున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

## బ్యాంకు లాకర్‌కు చేరిన ఏడువారాల నగలు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త



అమ్మవార్ల నగలను తిరిగి బ్యాంకు లాకర్లో భద్రపరుస్తున్న దృశ్యం

శ్రీకాళహస్తీశ్వరాలయంలో వెలసిన స్వయంభువు శ్రీకాళహస్తీశ్వరుడు, దేవేరి జ్ఞాన ప్రసూనాంబ అమ్మవారి ఏడు వారాల నగల్లో కొన్నింటిని పవిత్రోత్సవాల సందర్భంగా తీసుకున్నారు. వాటిని సోమవారం ఉదయం తిరిగి బ్యాంకు లాకర్లో భద్రపరచారు. స్వామి అమ్మవార్లకు ఈ ప్రాంతాన్ని పరిపాలించిన రాజులు 144 రకాల ఏడు వారాల విలువ కట్టలేని నగలను ఏర్పాటు చేసారు. అయితే వాటిని భద్రత దృష్ట్యా బయట పెట్టకుండా బ్యాంకు లాకర్లో భద్రపరచారు. కొన్ని సంవత్సరాలుగా మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా వాటిలో వాడుకకు ఉపయోగించే నగలను మాత్రము బయటకు తీసారు. తిరిగి ఉత్సవాలు పూర్తి అయిన తరువాత బ్యాంకు లాకర్లో భద్రపరుస్తున్నారు. ఈ నేపథ్యంలో పవిత్రోత్సవాల సందర్భంగా స్వామి అమ్మవార్ల అలంకరణలకు బయటకు తీసినకాసుల పేరు, మామిడి పిందెల దండ, ఏకముఖ రుద్రాక్ష, పగడాల మాల, యజ్ఞోపవీతంలను తిరిగి బ్యాంకు లాకర్లో భద్రపరచారు. ఈ కార్యక్రమాల్లో ఈఓ కె.వి సాగర్‌బాబు, డెప్యూటీ ఇఓ వెంకటసుబ్బయ్య, అకౌంటెంట్ యుగంధర్, సూపరింటెండెంట్ కళ్యాణి, సూరి గురుకుల్, సిసి చేజర్ల హరికృష్ణ పాల్గొన్నారు.

## వీఆర్వోపై దాడి.. పోలీసులకు ఫిర్యాదు

కుప్పంరూరల్, అక్టోబర్ 9 ప్రభాతవార్త



కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ విషయంగా తనపై ఓ వ్యక్తి దాడి చేసి చెప్పుతో కొట్టినట్లు గ్రామ రెవెన్యూ అధికారి పోలీసులకు సోమవారం ఫిర్యాదు చేశారు. మండలంలోని కొటాలూరు పంచాయతీ వీఆర్వోగా వెంకటాచలపతి గతేడాది జూలై నెలనుంచి పనిచేస్తున్నారు. గ్రామానికి చెందిన పాండురంగన్ ఆర్మీలో పనిచేస్తూ ప్రమాదవశాత్తు మృతి చెందాడని అయితే అతని భార్య జీవిత తమకు ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థికసాయంకు అవసరమైన కుటుంబ సభ్యుల సర్టిఫికెట్ కోసం మీసేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకుందని తెలిపారు. అయితే మృతి చెందిన పాండురంగన్ అన్న మణి అనే వ్యక్తి కుటుంబ సభ్యుల సర్టిఫికెట్‌లో జీవిత పేరు లేకుండా మిగతా వారి పేర్లు ఇవ్వాలని తనపై ఒత్తిడి తెచ్చాడన్నారు. అందుకు తాను అంగీకరించక పోగా సోమవారం తాను కుప్పం వస్తుండగా మణి తన టు వీలర్‌లో వచ్చి కొట్టి తనపై దాడి చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. అడ్డుకోబోయిన వీఆర్ఏ మురుగన్‌పై సైతం దాడి చేశాడని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ సంఘటన పట్ల వీఆర్వోలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు 38మంది ఎంపిక



శాంతిపురం, అక్టోబర్ 9 ప్రభాతవార్త

స్థానిక ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో నిర్వహించిన ప్రధానమంత్రి నేషనల్ అప్రెంటీస్ మేళాకు విశేష స్పందన లభించింది. ప్రముఖ కంపెనీలైన అమరరాజా, హోండా, హిందాల్కో, టైటాన్, బారామతి ఆగ్రోస్ సంస్థల ప్రతినిధులు ఈ మేళాలో పాల్గొన్నారు. మొత్తం 81మంది విద్యార్థులు మేళాకు హాజరు కాగా 38మంది ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ నగేష్ తెలిపారు. వీరికి నెలకు సుమారు 11వేల వేతనాలు అందుతాయన్నారు.

## సిబ్బందిని కాంట్రాక్టు ఉద్యోగులుగా గుర్తించాలి

చిత్తూరురూరల్, అక్టోబరు 9 ప్రభాతవార్త:

108 సర్వీసులో పనిచేస్తున్న ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దారుణంగా వున్నాయనీ, ఎన్నికలకు ముందు పాదయాత్రలో 108 ఉద్యోగులను వైద్యఆరోగ్యశాఖలో కాంట్రాక్టు ఉద్యోగులుగా చేస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని 108 అంబులెన్స్ ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు శివకుమార్ సోమవారం జిల్లా జాయింట్ కలెక్టరును కలిసి వినతి చేసారు. కరోనా సమయంలో జీతాలు సక్రమంగా అందకపోయినా సేవాభావంతో నిజాయితీగా ఎన్నో ప్రాణాలను కాపాడి అత్యుత్తమ సేవలను అందించామన్నారు. 108 సర్వీసులో పనిచేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వ వైద్యశాఖలో చేపడుతున్న నియామకాల్లో సంబంధిత విద్యార్హత కలిగిన వారికి వారి సర్వీసును అనుసరించి వెయిటేజ్ మార్కులు అందించాలని కోరారు. జిల్లా జాయింట్ కలెక్టరుకు వినతి చేసిన వారిలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాబ్జాన్, కార్యనిర్వాహక అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, మహిళా అధ్యక్షురాలు కోమల, 108 సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## నేడు డయల్ యువర్ డియం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి డిపో పరిధిలో నేడు మద్యాహ్నం 2గంటల నుంచి 4గంటల వరకు డయల్ యువర్ డిఎం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ వై.రాజవర్ధన్‌రెడ్డి తెలిపారు. ప్రయాణీకుల సమస్యలను 9959225673 నంబర్‌కు ఫోన్‌చేసి తెలిపి పరిష్కరించుకోవచ్చని ప్రయాణీకులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

## నిత్యావసర సరుకులు పంపిణీ

గూడూరు, అక్టోబర్ 9, ప్రభాతవార్త



గూడురు పట్టణంలోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్ ఆడిటోరియంలో రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో రోటరీ చేయూత కార్యక్రమంలో భాగంగా నిరాశ్రయులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో గూడూరులోని డిఎన్ఆర్ కమ్యూనిటీ హాల్ ఆడిటోరియంలో రోటరీ క్లబ్ వెస్ట్ ఆధ్వర్యంలో రోటరీ చేయూత కార్యక్రమంలో భాగంగా నిరాశ్రయులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షులు సనత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గత మూడు సంవత్సరాల నుంచి నిర్విఘ్నంగా ప్రతి నెల రోటరీ చేయూత కార్యక్రమం దాతలు సహకారంతో నిర్వహిస్తున్నామని రాబోయే రోజుల్లో కూడా క్లబ్ ఆధ్వర్యంలో మరెన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమానికి దాతగా తాళ్లూరు సిద్ధయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు తాళ్లూరు శ్రీనివాసులు వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో శివప్రసాద్, దనుంజయ రెడ్డి, ఎస్ఎల్ఎన్ బాబు, బలరాం రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## దీననారాయణులకు అన్నప్రసాదం

చిత్తూరురూరల్, అక్టోబరు 9 ప్రభాతవార్త:

పట్టణంలోని దీననారాయణులకు భగవాన్ శ్రీ సత్యసాయి బాబా అనుగ్రహంతో సోమవారం అన్నప్రసాదం చేసినట్లు సత్యసాయి సమితి జిల్లా అధ్యక్షులు మధుసూదనం తెలిపారు. సాయి భక్తులు ప్రతిరోజు తమ ఇంటిలో పక్కన పెట్టుకొన్న బియ్యంతో వండిన పులిహోర, పెరుగన్నం, లెమన్‌రైస్‌ను ప్రభుత్వాసుపత్రిలో రోగుల సహాయకులకు, దీననారాయణులకు అందించినట్లు పేర్కొన్నారు. ఈ సేవలో మహిళా సభ్యులు శ్రీదేవి,ద్రాక్షాయని, గీత, వాసంతి, మంజులతో పాటు శివప్రకాష్, దేవరాజ్, గోవర్ధన్, కన్వీనర్ శేషనారాయణ పాల్గొన్నారు.

## పివికెయన్ కళాశాలలో జాబ్‌మేళా

చిత్తూరురూరల్, అక్టోబరు 9 ప్రభాతవార్త:

ఈనెల 13వ తేది ఉదయం 10గంటలకు పివికెయన్ ప్రభుత్వ కళాశాల నందు ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా. పి. జీవన జ్యోతి తెలిపారు. ఈ జాబ్‌మేళాలో ఏజిటిఆర్ఎస్ ఐ దార్ట్, క్రియ నెక్స్ట్ వెల్త్ ప్రైవేట్ లిమిటెడ్, పార్లె బిస్కట్ ప్రైవేట్ లిమిటెడ్, అపోలోఫార్మసి, కోజెంట్ ఈ సర్వీసెస్, క్లింటోక్లారిఫై ప్రైవేట్ లిమిటెడ్ తదితర బహుళ జాతీయ కంపెనీలు ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కనీస విద్యార్హత ఐటిఐ. డిగ్రీ ఫాస్/ఫెయిల్, 18-30 వయస్సు కలిగిన స్త్రీ, పురుష అభ్యర్థులు హాజరుకావచ్చునన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు తమ ఒరిజినల్ సర్టిఫికేట్స్‌తో పాటు ఫోటోలు, ఆధార్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లతో హాజరుకావచ్చునన్నారు. ఇతర వివరాలకు జెకెసి సమన్వయకర్త బాబు (7893110120, 8121984014,9505601887)ను సంప్రదించాలని కోరారు.

## చంద్రబాబు అక్రమ అరెస్ట్‌పై తవణంపల్లెలో నిరసన

తవణంపల్లె, అక్టోబరు 9 ప్రభాతవార్త:



టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌పై మండల కేంద్రం తవణంపల్లెలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నియోజకవర్గ పరిధిలోని టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఈనిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరు నల్లవస్త్రాలు ధరి oచి మోకాళ్లపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ప్రభుత్వం కక్ష్యపూరితంగా అరెస్ట్ చేసిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడును వెంటనే విడుదల చేయాలని డిమాండు చేశారు. ఈకార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు, మాజీ జడ్పీటీసీలు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు పాల్గొన్నారు.

## చంద్రబాబుకు జరిగిన అన్యాయం ప్రజల్లోకి

మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్

కుప్పం, అక్టోబర్ 9 ప్రభాతవార్త



తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అక్రమ అరెస్ట్‌ను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్తా మని మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్ పేర్కొన్నారు. సోమవారం మున్సిపల్ పరిధి బైరుగానిపల్లిలో ప్రజలకు కరపత్రాలు పంచారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అభివృద్ధి తప్ప అవినీతి తెలియని వ్యక్తి చంద్రబాబు అన్నారు. 14 ఏళ్ల సిఎంగా పనిచేసిన వ్యక్తి ఎలాంటి తప్పు చేయకున్నా స్కిల్ స్కాం పేరిట చంద్రబాబును అరెస్ట్ చేసి జైలుకు పంపడం తగదన్నారు. రాష్ట్రంలో 17 స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటుచేసి లక్షలాది మందికి వృత్తి నైపుణ్య శిక్షణ ఇస్తే వారు ఉద్యోగావకాశాలు అందుకున్నారన్నారు. అయితే ఇందులో స్కాం జరిగిందని పేర్కొంటూ అసలు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలనే పరిశీలించకుండా కేసులు నమోదు చేసి అరెస్ట్ చేయడం బాధాకరమన్నారు. రాష్ట్ర ప్రజలు మరలా చంద్రబాబుకు పట్టం కట్టడం ఖాయమన్నారు. కుప్పంలో చంద్రబాబుకు లక్ష మెజార్టీ సాధించి తీరుతామన్నారు. కార్యక్రమంలో స్థానిక నేతలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు పెండింగ్ జీతాలు విడుదల చేయండి



బిజెపి నేత చిట్టిబాబు డిమాండ్

చిత్తూరురూరల్, అక్టోబరు 9ప్రభాతవార్త:

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు పెండింగ్ జీతాలు వెంటనే విడుదల చేయాలని బిజెపి నేత చిట్టిబాబు జిల్లా జాయింట్ కలెక్టరు శ్రీనివాసులను సోమవారం కలిసి వినతి చేసారు. సమగ్ర శిక్షా అభియాన్ పథక అమలుకు కేంద్రప్రభుత్వం 60శాతం నిధులు విడుదల చేయగా రాష్ట్రప్రభుత్వం తన వాటాగా ఆమోదించబడిన బడ్జెట్‌లో 40శాతం నిధులు విడుదల చేయాలన్నారు. కానీ మన రాష్ట్రంలో కేంద్రం విడుదల చేసిన నిధులను మాత్రమే ఉపయోగించుకొని రాష్ట్రం వాటా ఇవ్వడం లేదన్నారు. దీంతో సమగ్ర శిక్షా అభియాన్‌లో పనిచేసే ఉద్యోగులకు రాష్ట్రం మొత్తం మీద మూడు నెలల నుంచి, మన జిల్లాలో రెండు నెలల నుంచి జీతాలు ఇవ్వడం లేదన్నారు. జిల్లా జాయింట్ కలెక్టరును కలిసిన వారిలో బిజెపి నాయకులు చిట్టిబాబుతో పాటు రామభద్ర, ఉదయ్‌కుమార్, రెడ్డిమస్తాన్, రవి, చైత్రేష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిపిఎస్ రద్దయ్యేంతవరకు పోరాటం

– ఏపి సిపిఎస్ఈఏ నూతన జిల్లా అధ్యక్షులు సమీర్

చిత్తూరురూరల్, అక్టోబరు 9 ప్రభాతవార్త:

పదవీ విరమణాంతరం ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యా యుల శేష జీవితానికి ప్రధాన ప్రతిబంధకంగా పరిణమించే కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీంను రద్దు చేసేంతవరకు పోరాటం కొనసాగిస్తామని ఆంధ్రప్రదేశ్ కంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కె, సమీర్ స్పష్టం చేసారు. ఆదివారం సిబి రోడ్డులోని సంఘ కార్యాలయంలో అసోసియేషన్ కార్యవర్గ సమావేశంను జిల్లా



గౌరవాధ్యక్షులు సుధాకర్ అధ్యక్షతన ఏర్పాటుచేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగ ఉపాధ్యాయులను వారి ఇళ్లు, పాఠశాల వద్ద ముందస్తుగా అరెస్టు చేయడం, వేధింపులకు గురిచేస్తున్న ఘనత ఒక్క వైకాపాప్రభుత్వంకే చెందుతుందన్నారు. జీతాల చెల్లింపులో ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తోందని, దీంతో అనేకమంది ఉద్యోగ, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులకు గురికావలసి వస్తోందని ఆవేదన వ్యక్తం చేసారు. సమావేశంలో పెద్దఎత్తున సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**ఏపి సిపిఎస్ఈఏ నూతన కార్యవర్గం ఏర్పాటు**

చిత్తూరు పట్టణం సిబిరోడ్డులోని ఏపి సిపిఎస్ఈఏ కార్యాలయంలో ఆదివారం సంఘ నూతన కార్యవర్గాన్ని జిల్లా గౌరవాధ్యక్షులు సుధాకర్ అధ్యక్షతన ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. జిల్లా నూతన సంఘ అధ్యక్షులు సమీర్‌తోపాటు అసోసియేట్ అధ్యక్షులుగా లత, జిల్లా ప్రధాన కార్యదర్శిగా నరసింహులు, అదనపు ప్రధాన కార్యదర్శిగా కె.ఆర్.అమర్నాథ్, కోశాధికారిగా రాజేష్, మహిళా అధ్యక్షురాలుగా సుబ్బ లక్ష్మీ,రాష్ట్రకౌన్సిలర్లుగాజయప్రకాష్,వినోద్, రిజ్వాన్, రమణయ్య, శ్రావణ్‌లను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## 2024లో మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డే సీఎం

– వైసీపీ నేత మొబిన్‌బాషా

కోట, అక్టోబర్ 9 ప్రభాతవార్త



2024లో జరగబోవు ఎన్నికల్లో మళ్లీ ప్రజలందరూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేసుకోవాల్సిన అవసరం ఉందని తిరుపతి పార్లమెంటు మైనార్టీ సెల్ నాయకులు షేక్ మొబిన్‌బాషా చెప్పారు. సోమవారం విజయవాడలో వైసీపీ నిర్వహించిన సదస్సుకు వెళుతూ కోటలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. గ్రామస్థాయిలో సచివాలయ కన్వీనర్లు, ఎంపిటిసిలు, సర్పంచులు, గృహ సారథులు, వాలంటీర్లు ప్రతి ఇంటిని సందర్శిస్తూ ప్రతి గ్రామంలో వైసీపీ జెండాను రెపరెపలాడించాలని కోరారు. ప్రజల ఆశీస్సులతో ముందుకెళ్లాలని కోరారు. గ్రామస్థాయిలోనే సచివాలయ వ్యవస్థను తీసుకొచ్చి ప్రతి 50 ఇళ్లకు ఒక వాలంటీర్ ఉండేలా వాలంటీర్ వ్యవస్థను తీసుకురావడం, మేనిఫెస్టోలో చెప్పిన విధంగా 99 శాతం హామీలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నెరవేర్చారని చెప్పారు. మళ్లీ అన్ని సంక్షేమ పథకాలు అందాలంటే వైసీపీని అధికారంలోకి తీసుకురావాలని కోరారు.

## ఆకట్టుకున్న స్టాల్స్

కోట, అక్టోబర్ 9 ప్రభాతవార్త




కోట మండలం చంద్రశేఖరపురంలో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయం-2 పరిధిలోని అంగన్‌వాడీ కార్యకర్త మట్టిగుంట రమణమ్మ ఏర్పాటు చేసిన పలురకాల స్టాల్స్ విశేషంగా ఆకట్టుకుంది. ఎంపిడిఓ భవాని, ఐసిడిఎస్ అధికారులు ఈ స్టాల్స్‌ను సందర్శించి సంతృప్తి వ్యక్తం చేశారు. స్టాల్స్‌ను గురించి అంగన్‌వాడీ కార్యకర్త రమణమ్మను అడిగి తెలుసుకున్నారు.

## ప్రతి ఇంటికి మెరుగైన వైద్యం

– ఎంపిడిఓ భవాని

కోట, అక్టోబర్ 9 ప్రభాతవార్త




ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ముందుచూపుతో ప్రతి ఇంటికి మెరుగైన వైద్యం అందించేలా కృషి చేస్తున్నారని ఎంపిడిఓ మారెళ్ల భవాని అన్నారు. సోమవారం మండలంలోని చంద్రశేఖరపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ కార్పొరేట్ స్థాయి వైద్యం అందించాలని ప్రతి గ్రామానికి వచ్చి 13 రకాల వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ దేశాల్లో ఏ ముఖ్యమంత్రికి లేని ముందుచూపు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ఉందన్నారు. ఉచితంగా శస్త్రచికిత్సలు కూడా చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్, వైద్యులు, సచివాలయ ఉద్యోగులు, ఉప సర్పంచ్ పల్లిముల్లు విజయసారధిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సర్వర్ సమస్య పరిష్కరించండి

కోట, అక్టోబర్ 9 ప్రభాతవార్త



కోట మండలంలోని ఎండియు ఆపరేటర్ల ద్వారా ప్రజలకు అందజేస్తున్న బియ్యం పంపిణీ కార్యక్రమంలో భాగంగా సర్వర్లు సిగ్నల్స్ సక్రమంగా పనిచేయక పోవడంతో తాము సకాలంలో బియ్యం పంపిణీ చేయలేకపోతున్నామని ఎండియు ఆపరేటర్ల అసోసియేషన్ అధ్యక్షులు ఏడుకొండలు చెప్పారు. సోమవారం స్థానిక తహశీల్దార్ పద్మావతిని కలిసి ఆ మేరకు వినతిపత్రం అందజేశారు. సర్వర్ సమస్య వల్ల ప్రతి నెలా 200 నుంచి 500 రేషన్‌కార్డుదారులకు బియ్యం అందించలేకపోతున్నామని తెలిపారు. గత నెలలో కూడా ఇదే సమస్య వల్ల ప్రజలకు జవాబు చెప్పుకోలేక ఇబ్బందులు పడ్డామని వాపోయారు. పిడిఎస్ డిస్ట్రిబ్యూషన్ సర్వర్ సక్రమంగా పనిచేసేవిధంగా చూడాలని ఆయన కోరారు.

## వ్యాయామంతోనే సంపూర్ణమైన ఆరోగ్యం

కోట, అక్టోబర్ 9 ప్రభాతవార్త



మహిళలు సంపూర్ణమైన ఆరోగ్యవంతులుగా ఉండాలంటే నిత్యం వ్యాయామం, నడక, యోగా తప్పనిసరి అని కోట ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ పి.రూప అన్నారు. సోమవారం కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఐఎస్‌టిలో మహిళా సాధికారత సెల్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగించారు. పిసిఓఎస్, పిసిఓడి గల కారణాలు, సమస్యలను ఎలా గుర్తించవచ్చు, ఏ విధంగా అధిగమించవచ్చని తెలిపారు. ప్రధానంగా పిసిఓఎస్ సమస్యతో బాధపడే వారు మంచి ఆహారపు అలవాట్లతో పాటు క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తే మంచి ఫలితాలు ఉంటాయన్నారు. ఇంకా అనేక సమస్యలపై ఆమె సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయకుమార్‌రెడ్డి, మహిళా సాధికారత సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్.ఇందుమతి, డాక్టర్ బి.వాసవి, మహిళ అధ్యాపకులు పాల్గొన్నారు.

## నావెల్ యూనిట్ ఆధ్వర్యంలో క్యాడెట్ల ఎంపికలు




కోట, అక్టోబర్ 9 ప్రభాతవార్త

కోట మండలం విద్యానగర్‌లోని ఎన్‌బికెఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో నౌకాదళ్ ఎన్‌సిసి క్యాడెట్లు నావెల్ యూనిట్ ఆధ్వర్యంలో క్యాడెట్స్ ఎంపికలు నిర్వహించారు. ఇందులో కళాశాలకు చెందిన ప్రథమ సంవత్సరం విద్యను అభ్యసిస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థులు 60 మంది పాల్గొన్నారు. వీరికి శారీరక, రాత, వ్యక్తిగత ఇంటర్వ్యూల ద్వారా ఎంపిక నిర్వహించారు. అందులో 20 మందిని ఎన్నుకున్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల డైరెక్టర్ డాక్టర్ వి.విజయకుమార్‌రెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సిసి అధికారి సబ్ లెఫ్టినెంట్ డాక్టర్ మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

## ప్రతి నెల గర్భవతులకు పౌష్టికాహారం అందించడం అభినందనీయం

వైద్యాధికారిణి డాక్టర్ పావని

చిల్లకూరు, అక్టోబర్ 9, ప్రభాతవార్త



ప్రతి నెల గర్భవతులకు పౌష్టికాహారం అందించడం అభినందనీయమని వైద్యాధికారిణి డాక్టర్ పావని తెలిపారు. చిల్లకూరు మండలంలోని చింతవరంలో ఏర్పాటై ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భవతులకు రాజీనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో పౌష్టికాహారం పంపిణీ చేశారు. చిల్లకూరు మండలంలోని చింతవరం గ్రామంలో ఏర్పాటై ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భవతులకు వైద్యాధికారులు పాల్ జాన్సన్, పావని పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. అనంతరం రాజీనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గర్భవతులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పావని మాట్లాడుతూ ప్రతి నెల గర్భవతులకు ట్రస్టు ఆధ్వర్యంలో పౌష్టికాహారం అందించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు పిచ్చయ్యనాయుడు, సభ్యులు బాబు, భాస్కర్, వెంకటేశ్వర్లు, తదితరులు పాల్గొన్నారు.

## సూళ్లూరుపేట ఎస్ఐగా బ్రహ్మనాయుడు

సూళ్లూరుపేట, అక్టోబర్ 9 ప్రభాతవార్త

సూళ్లూరుపేట నూతన ఎస్ఐగా బ్రహ్మనాయుడు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గూడూరు రూరల్ ఎస్ఐగా పనిచేస్తున్న బ్రహ్మనాయుడు బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ ఎస్ఐగా పనిచేస్తున్న రవిబాబు తిరుపతి వీఆర్‌కు వెళ్లారు. ఎస్ఐగా బాధ్యతలు స్వీకరించిన బ్రహ్మనాయుడు మాట్లాడుతూ సూళ్లూరుపేటలో శాంతిభద్రతలను పరిరక్షించేందుకు కృషి చేస్తానని అన్నారు.

## మోటార్ బైక్ ఢీ కొని వ్యక్తి మృతి

గూడూరు, అక్టోబర్ 9, ప్రభాతవార్త

గూడూరు పట్టణంలోని వివేకానంద రోడ్డులో మోటార్ బైక్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు గూడూరు రెండో పట్టణానికి చెందిన రిటైర్డ్ ట్రాన్స్‌కో ఉద్యోగి జనార్ధన్ రెడ్డి (65) పనుల నిమిత్తం గూడూరు పట్టణంలోని వివేకానంద రోడ్డు సమీపంలో అవతలి వైపుకు రోడ్డు దాటుతుండగా అదే వైపు వెంకటేష్ అనే యువకుడు బైక్ ఢీ కొనిడంతో తీవ్ర గాయాలైనాయి. హుటాహుటిన స్థానికులు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వైద్యులు మెరుగైన వైద్యం కోసం నెల్లూరుకు తరలించాలని సూచించారు. అతను మార్గ మధ్యలోనే మృతి చెందారన్నారు.

## తడ, వాటంబేడులలో బొమ్మన్ 15వ వర్ధంతి

తడ, అక్టోబర్ 9 ప్రభాతవార్త



దివంగత పులికాట్ జాలర్ల సంక్షేమ సంఘం నేత, తడ మండల మాజీ అధ్యక్షుడు, టిడిపి రాష్ట్ర నాయకుడు బొమ్మన్ సుందరయ్య 15వ వర్ధంతి సందర్భంగా సోమవారం తడ, వాటంబేడులలో కార్యక్రమాలు నిర్వహించారు. తడలో జరిగిన వర్ధంతి కార్యక్రమంలో సుందరయ్య చిత్రపటానికి టిడిపి నాయకులు శ్రద్ధాంజలి ఘటించారు. మాజీ ఎంపి, సూళ్లూరుపేట నియోజకవర్గం టిడిపి ఇన్‌ఛార్జ్ నెలవల సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథిగా పాల్గొని సుందరయ్య పులికాట్ జాలర్ల సంక్షేమానికి చేసిన సేవలను కొనియాడారు. తెలుగుదేశం పార్టీ తిరుపతి జిల్లా కార్యదర్శి వేనాటి సతీష్‌రెడ్డి, అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్‌రెడ్డి, తడ మండల టిడిపి అధ్యక్షుడు కామిరెడ్డి మురళీరెడ్డి, మాజీ జడ్పిటిసి బొమ్మన్ శ్రీధర్, పార్టీ నాయకులు ఆకుతోట రమేష్, మాధవనాయుడు, సుదర్శన్, నీలకంఠం, బొమ్మన్ పళణి, ఏకాంబరం, జీవా, యుగంధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. వాటంబేడుకుప్పంలో బొమ్మన్ సుందరయ్య విగ్రహానికి టిడిపి నాయకులతో పాటు పలువురు పులికాట్ జాలర్లు నివాళి అర్పించారు. అక్కడిఎస్సీ కాలనీలో సుందరయ్య వర్ధంతి నిర్వహించారు. మూడుచోట్ల మధ్యాహ్నం అన్నదానం చేశారు.

## తుమ్మూరులో జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్

నాయుడుపేట, అక్టోబర్ 9 ప్రభాతవార్త



నాయుడుపేట పట్టణంలోని తుమ్మూరు అర్బన్ హెల్త్ సెంటర్‌లో సోమవారం జగనన్న ఆరోగ్య సురక్ష క్యాంప్ నిర్వహించారు. ఈ క్యాంప్‌ను మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు ప్రారంభించారు. జగనన్న ఆరోగ్య సురక్షలో భాగంగా పలువురు వ్యాధిగ్రస్తులకు వైద్యులు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. అలాగే ఐసిడిఎస్ అధికారులు పౌష్టికాహార పదార్థాల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ పేదల ఆరోగ్యం దృష్ట్యా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలోజెసిఎస్‌కన్వీనర్‌చదలవాడకుమార్,కౌన్సిలర్లుదారారవి, వైద్యులు, వాలంటీర్లు పాల్గొన్నా రు.

## సూళ్లూరుపేటలో నేత్రదానం

సూళ్లూరుపేట, అక్టోబర్ 9 ప్రభాతవార్త

సూళ్లూరుపేటలోని ఆచార్య భరద్వాజ సేవాసంస్థకు సోమవారం 422వ నేత్రదానం అందింది. సంజీవయ్య నగర్‌కు చెందిన ఆదూరు అన్నపూర్ణ మృతిచెందడంతో ఆమె కుటుంబ సభ్యుల అంగీకారంతో కార్నియాలను సేకరించి నెల్లూరులోని మోడరన్ ఐ ఆసుపత్రికి పంపారు. ఈ కార్యక్రమంలో ఆచార్య భరద్వాజ సేవాసంస్థ సభ్యులు పాల్గొన్నారు.

## గర్భిణీలకు పౌష్టికాహారం పంపిణీ

గూడురు, అక్టోబర్ 9, ప్రభాతవార్త



మూఢనమ్మకాలపై ప్రచారం మాత్రమే కాకుండా గూడూరు జన విజ్ఞాన వేదిక అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందని జెవివి సభ్యులుగా ఉండటం మాకెంతో గర్వకారణంగా ఉందని జన విజ్ఞాన వేదిక అధ్యక్షులు వేగురు రాజేంద్ర ప్రసాద్ వెల్లడించారు. గూడూరు పట్టణంలోని ప్రభుత్వ ఏరియా హాస్పిటల్‌లో ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణీలు డాక్టర్ల వద్ద వైద్య పరీక్షల నిర్వహించుకున్నారు. జన విజ్ఞాన వేదిక అధ్యర్యంలో గర్భిణీలకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా జెవివి అధ్యక్షులు రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యా, వైద్య రంగాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, గత తొమ్మిది సంవత్సరాలుగా ప్రతి నెల గర్భిణీలకు పౌష్టికాహారం అందిస్తున్నామని పేర్కొన్నారు. డాక్టర్ల సలహాలు పాటించి గర్భిణీలు సుఖ ప్రసవం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో విజయ్ బాబు, బాలకృష్ణం రాజు, పురుషోత్తం, వరప్రసాద్, డాక్టర్ రాజా, తదితరులు పాల్గొన్నారు.

## గ్యారేజీ ఇంచార్జిలు, స్టోర్స్ సూపర్వైజర్లతో సమీక్షా సమావేశం

తిరుపతి రవాణా, అక్టోబర్ 9, ప్రభాతవార్త



తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో తిరుపతి జిల్లాలో పనిచేయు 11 డిపోల గ్యారేజీ ఇంచార్జిలు, స్టోర్స్ సూపర్వైజర్ల సమీక్షా సమావేశం సోమవారం నిర్వహించారు. ఈ సమీక్షా సమావేశంలో తిరుపతి జిల్లా ప్రజా రవాణా అధికారి చెంగల్ రెడ్డి రాబోవు నవరాత్రి బ్రహ్మోత్సవాలను దృష్టిలో పెట్టుకుని బస్సుల కండిషను మంచిగా పెట్టాలని కోరారు. దానికి కావల్సిన అసిస్టెన్స్ గురించి చర్చించారు. అలాగే బస్సులు ఫెయిల్ కాకుండా మైంటైస్ చెయ్యాలని కూడా కోరారు. తరువాత సాలకట్ల బ్రహ్మోత్సవాలలో అందరు మంచిగా పనిచేశారని ఎటువంటి ఇబ్బందులు లేకుండా బస్సులు విజయవంతంగా నడిపినందుకు అందరిని అభినందించారు. రాబోవు బ్రహ్మోత్సవాలను కూడా అందరు సమిష్టిగా పనిచేయాలని, ఇంధనం పొదుపు చేయాలని కూడా చెప్పారు.

## ఆరోగ్యాంధ్రాగా తీర్చి దిద్దటానికే జగనన్న ఆరోగ్య సురక్ష పవిత్రారెడ్డి

శ్రీకాళహస్తి రూరల్,అక్టోబర్ 9 ప్రభాతవార్త



ఆంధ్ర ప్రదేశ్‌ను ఆరోగ్యాంధ్ర ప్రదేశ్‌గా తీర్చి దిద్దటమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని నియోజకవర్గ వైకాపా నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని ఇనగలూరు సచివాలయ పరిధిలో 'జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా హాజరైన విశేష గ్రామీణ ప్రజలకు వివరిస్తూ నిరుపేదల కోసం అహర్నిశలు పథకాలు రూపొందించే నాయకుడు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ వారి సంక్షేమాన్ని కాంక్షించే నాయకుడు శాసనసభ్యుడు బియ్యపు మధుసూదనరెడ్డి అన్నారు. గతంలో నియోజకవర్గాన్ని 35 సంవత్సరాల పాటు ఏక చ్ఛత్రాభిపత్యంగా పరిపాలించిన ఒకే కుటుంబం తగుదనమ్మా అంటూ ఎన్నికల సమయంలో ప్రజలకు అరచేతిలో స్వర్గం చూపుతూ ఎన్నికల్లో గెల్చుకొని హైదరాబాదుకు ఉడాయిస్తారని వివరించారు. వారిని నమ్మితే నట్టేటమునుగుతారని వివరించారు. ఎప్పుడూ జనంలో ఉంటూ తన కుటుంబాన్ని శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజల సేవకు అంకితం చేసిన మధుసూధనరెడ్డి సేవలను గుర్తించి గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా, ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా నిరుపేదలకు సేవలందిస్తున్న ప్రభుత్వం ఫ్యామిలి డాక్టర్ ద్వారా ప్రజల ఆరోగ్యాన్ని కాపాడటానికి చర్యలు తీసుకునే ప్రజా ప్రభుత్వం వైకాపా అని వివరించారు. శ్రీకాళహస్తి మండంలో శ్రీకాళహస్తి నుంచి పల్లంకు డబుల్‌రోడ్డును మంజూరు చేయించిన ఘనత బియ్యపు మధుసూధనరెడ్డిది అన్నారు. రూ.20కోట్లతో పనులు జరుగుతున్నాయన్నారు. ఈ కార్యక్రమాల్లో మండల పార్టీ అధ్యక్షుడు వయ్యాల కృష్ణారెడ్డి, సర్పంచ్ నాగరాజు, వెంకటరెడ్డి, పాపయ్య, సీతారామయ్య, ఊట ప్రసాద్, కలివేలయ్య, రాధాకృష్ణ, బాలకృష్ణ వైద్యశాఖాధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## తిరుపతిఐఐటిలో పబ్లిక్ పాలసీ ఇన్ ప్రాక్టిస్

ఏర్పేడు(శ్రీకాళహస్తి రూరల్), అక్టోబర్ 9 ప్రభాతవార్త



తిరుపతి ఐఐటిలో విద్యార్థులకు జీవితాలకు ఉపయోగపడే సామాజిక కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. సోమవారం పబ్లిక్ పాలసీ ఇన్ ప్రాక్టిస్ అనే అంశంపై రెండు రోజుల శిక్షణా తరగతులను నిర్వహించారు. హ్యూమానిటీస్ అండ్ సోషల్ సైన్సస్ శాఖ కార్యక్రమాలను రూపకల్పన చేసారు. తిరుపతి ఐఐటి సెంటర్ ఆఫ్ రీసెర్చ్ ఇన్ స్కిమ్స్ అండ్ పాలసీస్ సహకారంతో పబ్లిక్ పాలసీ ఇన్ ప్రాక్టీస్ రెండు రోజుల పాటు వర్క్‌షాప్ నిర్వహించింది, మాస్టర్ ఆఫ్ పబ్లిక్ పాలసి ప్రోగ్రామ్ విద్యార్థులు క్షేత్ర స్థాయిలో సంగ్రహించిన నిజజీవిత పరిస్థితులను బహిర్గతం చేయటం దారా మ్యాడ్యూల్స్ ఎంపిపిప్రోగ్రామ్‌కు అనుబంధంగా ఉంటాయి. వర్క్‌షాపులోని సెషన్‌లను సీనియర్ మోస్ట్ సివిల్ సర్వేంట్‌లు పబ్లిక్‌పాలసీ సిద్ధాంతాలకు అనుసంధానించే కేస్ స్టడీస్‌ని ఉపయోగించి పంపిణీ చేసారు. ప్రారంభ ఉపన్యాసాన్ని డైరెక్టర్ ప్రొఫెసర్ కె.ఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ భారత దేశంలో కెల్లా తిరుపతి ఐఐటినితీర్చిదిద్దుటకు ప్రణాళికా బద్ధంగా వ్యవహరిస్తుందన్నారు. రాబోవు రోజుల్లో విద్యార్థులకు విద్యతో పాటు క్షేత్ర స్థాయిలో అవగాహన కల్పించుటకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమాల్లోరిటైర్డ్ ఐఏయస్ అధికారులు హాజరయ్యారు. విభాగదిపతి డాక్టర్ పి.ఎస్.ద్వివేది స్వాగతం పలికారు. వర్క్‌షాపు నిపుణులు ఎస్.ఎం. విజయానంద్ సీతారామం జనార్ధన్ కుంటే, ఆర్ సుబ్రమణ్యం, ఆర్.జులనియా, కే. సంధ్య, వివిల్‌వియస్‌యస్ సుబ్బారావులు పాల్గొన్నారు.

## వ్యవ'సాయం'లో అధికారులు సూచనలు తప్పనిసరి

-ఎడిఏ

.తొట్టంబేడు, అక్టోబర్ 9 ప్రభాతవార్త



అన్నదాతలు వ్యవసాయంలో అధి కారులు సూచనలు తీసుకుని సాగుకు సమాయత్తం కావాలని శ్రీకాళహస్తి వ్యవసాయ సహాయ సంచాలకులు జి.రమేష్‌రెడ్డి అన్నారు. సోమవారం తొట్టంబేడు మండల వ్యవసాయ కార్యాలయంలో రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుగంగ కాలువ పరిధిలో రాబోవు సీజన్‌కి సాగునీటి సరఫరా తక్కువగా ఉన్నందున తొట్టంబేడు మండలంలోతెలుగుగంగ పరీవాహన ప్రాంత రైతులు నార్లు పోసే ముందు ఆలోచించుకుని ముందుకెళ్ళాలని అలాగే రైతులు, ప్రైవేటు షాపుల్లో విత్తనాలు కొనుగోలు చేసేటపుడు తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని తీసుకున్న విత్తనాలను మొలకశాతం 80శాతం ఉంటేనే వాటిని వినియోగించుకోవాలని లేకుండా వెంటనే షాపులకు తిరిగి ఇచ్చేయాలని సూచించారు. మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో ముందుగా అవసరమైన ఎరువులను సంసిద్ధంగా ఉంచుకుని సకాలంలో రైతులకు అందజేసి ఎక్కడకూడా ఎరువుల కొరత రానీయకుండా చూసుకోవాలని సిబ్బందికి తెలిపారు. రైతులు కూడా కల్తీలేని, నాణ్యమైన విద్య, దృవీకరించబడిన ఎరువులు, పురుగుమందులనే రైతు భరోసా కేంద్రాల్లో ప్రభుత్వం సరఫరా చేస్తుందని రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వీటితో పాటు వ్యవసాయశాఖలో అమలవుతున్న వివిధ పథకాల గురించి చర్చించి సిబ్బంది పలు సూచనలు, సలహాలు అందించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి యం.సురేంద్రరెడ్డి, మరియు రైతు భరోసా కేంద్రాల సిబ్బంది హాజరయ్యారు.

## ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యం

తొట్టంబేడు, అక్టోబర్ 9 ప్రభాతవార్త



ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వ లక్ష్యమని గుండేలిగుంట సచివాయల పరిధిలోని చోడవరం మరియు గుండేలి గుంటలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఎంపిడిఓ సురేష్‌బాబు అన్నారు. ఈసందర్భంగా ఎంపిడిఓ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం ఎంతో మంచి పథకాన్ని ప్రవేశపెట్టిన పథకంలో ప్రజలందరు ఆరోగ్య పరీక్షలు చేసుకుని ఆరోగ్యంగా ఉండాలని లేకుంటే వారిని పరీక్షించి ఎవైనా ఇబ్బందులు ఉంటే వాటిని గుర్తించి వైద్యపరీక్షలతో పాటు మందులను కూడా పంపిణీచేస్తుందన్నారు. కార్యక్రమంలో గైనకాలజిస్టు, ఆర్థో, జనరల్ ఫిజీషియన్, కంటి వైద్యనిపుణులు మరియు ఎంఎల్‌హెచ్‌పిలు, ఎఎన్‌ఎంలు, ఆశావర్కర్లు మరియు పంచాయతీరాజ్ సీనియర్ కార్యదర్శి కె.ఆనందబాబు పాల్గొనగా మొత్తం 334మందికి వైద్యపరీక్షలు జరిపించుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ పుల్లారెడ్డి, మరియుచోడవరం సర్పంచ్ వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## బహుజన రాజ్య పునర్నిర్మాణమే లక్ష్యం..!

బిఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకర్

చంద్రగిరి, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



బహుజన రాజ్య పునర్నిర్మాణమే లక్ష్యంగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన వారిని చట్టసభల్లోకి పంపాలని బిఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.ప్రభాకర్ పిలుపునిచ్చారు. స్థానిక నాగాలమ్మ మలుపు వద్ద కాన్షీరామ్ 17వ వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం బహుజన సమాజ్‌వాదీ పార్టీ అసెంబ్లీ అధ్యక్షుడు పాముల జయదేవ్, అసెంబ్లీ కన్వీనర్ పూరిముట్ల బాబు సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన కాన్షీరామ్ చిత్రపటానికి ముఖ్యఅతిథిగా విచ్చేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలను చట్టసభలకు పంపడం ద్వారా ప్రజలందరికీ రాజ్యాధికారమని నిరూపించారని కొనియాడారు. రెండు తెలుగు రాష్ట్రాలలో బడుగు బలహీన వర్గాలతో పాటు అగ్రవర్ణ పేదలను ఏకం చేసి రాజ్యాధికారం దక్కించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎస్‌పి ప్రధాన కార్యదర్శిరెడ్డి లోకేష్, ఆర్గఐజింగ్ సెక్రటరీ రవి, నియోజకవర్గ మండల అధ్యక్షులు నరేష్, దొరస్వామి, వెంకటేష్, నాగరాజు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ అరెస్ట్‌కు మూల్యం చెల్లించుకోకతప్పదు..!

టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ

చంద్రగిరి, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్‌కు అధికార జగన్ ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని టిడిపి మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సింగు సుధ హెచ్చరించారు. చంద్రబాబు అరెస్ట్‌కు నిరసనగా సోమవారం తెలుగు మహిళా విభాగం ఆధ్వర్యంలో టవర్ క్లాక్ వద్ద రిలే నిరాహార దీక్ష చేపట్టారు. ఆమె మాట్లాడుతూ ప్రజల్లో చంద్రబాబు, లోకేష్ కార్యక్రమాలకు పెరుగుతున్న మద్దతును చూసి భయంతో ఇటువంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నట్లు ఎద్దేవా చేశారు. ఎటువంటి ఆధారం లేకుండా, ఎఫ్‌ఐఆర్‌లో పేరు లేకపోయినప్పటికీ చంద్రబాబును నిరంకుశత్వంతో అరెస్ట్ చేశారన్నారు. 2024 సాధారణ ఎన్నికలలో జగన్‌కు ప్రజలు తగిన బుద్ది చెప్పడానికి సిద్ధంగా వున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు లత సుబ్రమణ్యం, కళావతి, జిల్లా ఉపాధ్యక్షురాలు లంకెళ్ళ లలిత, అమ్ములు, నియోజకవర్గ అధ్యక్షురాల సావిత్రి, తిరుపతి రూరల్ మండల అధ్యక్షురాలు మహేశ్వరీ, చంద్రగిరి మండల అధ్యక్షురాలు సునీత, ఎంపిటిసి రాజ్యలక్ష్మి (పాకాల), మాజీ జడ్పీటిసి విజయ, మాజీ ఎంపిటిసి అనార్కలి, అదిలక్ష్మి, కన్నెమ్మ, నారా రాణి, పుష్ప, రేణుక, రాధ, నాయుడమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపలో హర్షిత్ రెడ్డికి ఆత్మీయ పలకరింపులు

రామచంద్రాపురం, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



వైసిపి యువజన నాయకుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డికి గడపగడపలో గ్రామీణ ప్రజలు ఆత్మీయ పలకరింపులతో ఘన స్వాగతం పలికారు. సోమవారం కమ్మకండ్రిగ పంచాయతీలో గడపగడపకు హర్షిరెడ్డి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాల కరపత్రాలను ఇంటింటికీ అందించారు. ఎంఎల్ఏ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మా అన్న చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని 2024లో భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి ఎ.వి.బ్రహ్మానందరెడ్డి, జడ్పీటిసి ఢిల్లీరాణి భానుకుమార్ రెడ్డి, వైస్ ఎంపిపి లావణ్య చంద్రబాబు, డివిజనల్ కన్వీనర్ బాబు యాదవ్, సర్పంచ్ కావ్య, సర్పంచ్ భారతి, ఉప సర్పంచ్ వేణుగోపాల్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## ఫారం-6 పై దృష్టి సారించండి

సత్యవేడు, అక్టోబర్ 9, ప్రభాతవార్త :



మండలంలోని అన్ని పోలింగ్ స్టేషన్ పరిధిలో ఫారం-6 లు తొలగింపులపై బిఎల్‌వోలు దృష్టి సారించే విధంగా చూడాలని బీజేపి మండల అధ్యక్షుడు మునిప్రతాప్ తహసిల్దార్ షేక్ జరినాబేగంను కోరారు. స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో ఓటర్ల జాబితాపై అన్ని రాజకీయ పార్టీ నేతలతో సోమవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈనేపథ్యంలో మునిప్రతాప్ మాట్లాడుతూ పలు పోలింగ్ స్టేషన్‌ల పరిధిలో డోర్ టు డోర్ ఓటర్ల సర్వే సక్రమంగా సాగలేదన్నారు. అందుకు ఆధారంగా ఒకే పోలింగ్ స్టేషన్‌లో 23 ఫారం-6 లను తహసిల్దార్‌కు అందించారు. ఇవేకాకుండా అర్హత ఉన్నా బిఎల్‌వోలు తప్పిదాలు కారణంగా ఓటు హక్కు పొందలేకపోతున్నారని ఆయన ఆరోపించారు. అదే విదంగా కొన్నిచోట్ల స్థిర నివాసాలు లేకున్నా ఓటు హక్కుమాత్రం ఉందని దీనిపై దృష్టి సారించాలని సిపిఎం మండల కార్యదర్శి రమేష్ తహసిల్దార్ దృష్టికి తీసుకువచ్చారు. గతంలో ఎమ్మెల్యేలుగా పనిచేసిన వారికి సత్యవేడు పట్టణంలో ఓటు హక్కుఉందని అలాంటి వాటిని కూడా విచారించి తొలగించాల్సిన భాధ్యత ఎన్నికల సిబ్బందిపై ఉందని వైకాపా నాయకుడు మునికృష్ణయ్య కోరారు. దీనిపై స్పందించిన తహసిల్దార్ మంత్రి నారాయణస్వామి ఓటును సత్యవేడు ఓటర జాబితా నుండి తొలగించామని , మరికొంతమంది ప్రజా ప్రతినిధులకు కూడా ఎన్నికల నియమావళి మేరకు నోటీసులు అందజేస్తామని తెలిపారు. బిఎల్‌వోలతో పూర్తి స్థాయిలో పరిశీలన చేయించి అర్హత ఉన్నవారందరు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చర్యలు తీసుకుంటామని మన్నారు.

## తెదేపా శాంతియుత న్యాయపోరాటమే గెలుస్తుంది

-మాజీ ఎమ్మెల్యే హేమలత

సత్యవేడు, అక్టోబర్ 9, ప్రభాతవార్త :



తెలుగుదేశంపార్టీ అధినేత నారాచంద్రబాబును నాయుడును రాజకీయకుట్ర పూరితంగానే అక్రమ అరెస్ట్ చేశారని తెలుస్తుందని మాజీ ఎమ్మెల్యే హేమలత అన్నారు. సోమవారం సత్యవేడులో చంద్రబాబుకు మద్ధత్తుగా కొనసాగుతున్న రిలేనిరాహార దీక్షలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ అధికారపార్టీ దురహంకార చర్యలకు ప్రజలు స్వస్తి చెపుతారని అన్నారు. ప్రజాక్షేత్రంలో తలపడే దమ్ములేకనే ప్రభుత్వం అక్రమ అరెస్టలకు పాల్పడుతుందని ఆరోపించారు. ఎప్పటికైనా తెదేపా శాంతియుత న్యాయ పోరాటమే గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో జరుగుతున్న అక్రమాలను ప్రజలు చూస్తున్నారు, రానున్న రోజుల్లో అధికారపార్టీ ప్రభుత్వానికి ఎలా బుద్ధి చెప్పాలో ప్రజలకు భాగా తెలుసునన్నారు. ఈకార్యక్రమంలో మండల అధ్యక్ష్యుడు ప్రవీణ్ కుమార్ రెడ్డి, యుగంధర్ రెడ్డిచ సీనియర్ నాయకుడు సుంధరరామిరెడ్డి, భాస్కర్, పరందామ నాయుడు, వరలక్ష్మి, శోభా తదితరులు పాల్గొన్నారు.

## గోవిందమాల భక్తులకు అన్నదానం

తిరుపతి రవాణా, అక్టోబర్ 9, ప్రభాతవార్త



శ్రీ మారుతి రాయన్ భక్త భజన మండలి చెన్నై వారు గత 26 సంవత్సరాల నుండి గోవింద మాల వేసుకుని 200 మంది భక్తులు కాలినడకన తిరుమలకి వస్తారు. వీరికి ఏకవీర సేవ పౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామీజీ తిరుచానూరులో భోజనం, సాయంత్రం అలిపిరి దగ్గర చపాతీ అందించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రాంచంద్ర, గుండాల గోపి పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## స్టాన్ ఫోర్ట్ యూనివర్సిటీ జాబితాలో

ఎస్వీయూ ఆచార్యుల అత్యుత్తమ ప్రతిభ

విసి రాజా రెడ్డి

తిరుపతి (క్రీడా), అక్టోబర్ 9, ప్రభాతవార్త



ఇటీవల ప్రొఫెసర్ జాన్ పిఏలోని డిస్ అండ్ స్టాన్ ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో అతని సహచరులు 2022 వరకు 2 శాతం అత్యంత ప్రభావంతమైన శాస్త్రవేత్తల జాబితాను అక్టోబర్ 6, 2023న ప్రచురించారు. ఈ జాబితాలో యూస్వీయూ ఆచార్యులు స్థానం సంపాదించడం పట్ల ఉపకులపతి ఆచార్య రాజా రెడ్డి హర్షం వ్యక్తం చేసారు. ఈ ర్యాంకింగ్, ప్రపంచ వ్యాప్తంగా అత్యంత ప్రతిష్టాత్మకమైనదిగా పరిగణించబడుతుందని, ఇది అనులేఖనాలు, హెచ్ ఇండెక్స్, సహ రచయిత సర్దుబాటు చేసిన హెచ్‌ఎం సూచిక, వివిధ రచయితల పేపర్‌లకు అనులేఖనాలు, మిశ్రమ సూచిక పై ప్రామాణిక సమాచారం పై ఆధారపడి ఉంటుందని వారు అన్నారు. అక్టోబర్ 2023 డేటా అప్‌డేట్‌లో వివిధ దేశాల నుండి 210000 కంటే ఎక్కువ మంది పరిశోధకులు ఉన్నారని, 22 శాస్త్రీయ రంగాలు, 176 సబ్ ఫీల్డ్‌ల క్రింద వర్గీకరించి, రెండు జాబితాలు విడుదల చేయబడ్డాయని, ఫిజిక్స్ విభాగానికి చెందిన ఆచార్య రాజగోపాల్, ఆచార్య సికె జయశంకర్, రిటైర్డ్ రెండు లిస్ట్‌లలో వరుసగా నాలుగు సంవత్సరాలు, నాల్గవసారి స్థానం సాధించారని చెప్పారు. అలాగే ఆచార్య ఎ. కృష్ణయ్య (రిటైర్డ్), కెమిస్ట్రీ విభాగం కూడా కెరీర్ లాంగ్ డేటాలో స్థానం పొందారని తెలిపారు. రాజగోపాల్ రెడ్డి, గాలియం నైట్రైడ్ ఆధారిత మెటల్, ఇన్సులేటర్, సెమీ కండక్టర్ లేదా హెట్రోజంక్షన్‌ల నిర్మాణ, రసాయన స్థితులు, విద్యుత్, ప్రస్తుత రవాణా లక్షణాలపై పరిశోధనకు సంబంధించి పని చేయగా, జయశంకర్ లేజర్‌లు, ఆప్టికల్ ఫైబర్‌యాంప్లిఫైయర్‌లు, సెన్సార్‌లు, బయోలేబుల్‌లు, డబ్ల్యూ వంటి వివిధ అప్లికేషన్‌ల కోసం వివిధ రకాల అరుదైన ఎర్త్ డోప్డ్ ఆప్టికల్ క్వాలిటీ గ్లాసెస్, నానో గ్లాస్ సిరామిక్స్, నానోక్రిస్టలైన్ మెటీరియల్‌ల తయారీ, క్యారెక్టరైజేషన్, ఆప్టిమైజేషన్‌పై కృషి చేసారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎండి హుస్సేన్, ప్రిన్సిపల్ ఆచార్య రామకృష్ణా రెడ్డి, ఆచార్య విజయభాస్కర్ రావు, ఆచార్య ఆర్‌పి విజయలక్ష్మి, ఆచార్య దేవ ప్రసాద్ రాజు, ఇతర అధ్యాపకులు ఈ విజయాన్ని అభినందించారు.

## బృందనాట్యంలో మదనపల్లె విద్యార్థి ప్రతిభ

మోమొంటో అందుకొన్న శిశిర

తిరుపతి, అక్టోబర్ 9 ప్రభాతవార్త :





భారతీయ సాంప్రదాయ కళా ఉత్సవంలో భాగంగా వే పౌండేషన్ 10వ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ వార్షికోత్సవాన్ని బాలాజి జిల్లా తిరుపతి మహతి ఆడిటోరియంలో జరిగాయి. ఈ బృంద నాట్యంలో మదనపల్లెలోని శ్రీ చైతన్య టెక్నోస్కూల్‌లో 8వ తరగతి చదివే విద్యార్థిని రామక్కగారి శిశిర ప్రతిభ కనపరిచింది. భారతీయ సాంప్రదాయ కళలు ఉట్టిపడేలా వే ఫౌండేషన్ 10వ వార్షికోత్సవ సందర్భంగా కళా ఉత్సవం పేరుతో సంగీతం, కూచిపూడి, భరతనాట్యం, ఆంధ్రనాట్యం, కథక్, ఒడిస్సి, జానపద నృత్యం, సోలో, బృందనాట్యం వంటి ప్రదర్శనలు నిర్వహించారు. ఈ కళాక్షేత్రంలో పాల్గొన్న ఈ విద్యార్థినికి వే ఫౌండేషన్ సంస్థ డాక్టర్ పైడి అంకయ్యచే పురస్కార అవార్డు, నాట్యకళాబ్రహ్మ మెమొంటోను అందజేసి సత్కరించారు. దీంతో విద్యార్థినిని ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందించారు.

## టిటిడి కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు పెంచిన టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డికి ధన్యవాదాలు

ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కేతారి రాధాకృష్ణ హర్షం

తిరుపతి టౌన్, అక్టోబర్ 9, ప్రభాతవార్త



టిటిడిలో కాంట్రాక్ట్ కార్మికులకు జీతాలు పెంచిన టిటిడి బోర్డు చైర్మన్ భూమన కరుణాకర్ రెడ్డికి ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కేతారి రాధాకృష్ణ ధన్యవాదాలు తెలిపి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిటిడిలో పనిచేస్తున్న టిటిడి కాంటాక్టు కార్మికుల వేతనం 5 వేల రూపాయిలు పెంపు చేస్తూ బోర్డులో తీర్మానం చేయడం గతంలో భూమన కరుణాకర్ రెడ్డి ఇచ్చిన హామీని అమలుపరచడం చాలా శుభ పరిణామమని టిటిడిలో పనిచేస్తూన్న కాంట్రాక్ట్ కార్మికులకు దసరా కానుకగా వారి కుటుంబాలలో పండుగ వాతావరణం నెలకొంటుందని అన్నారు. ఇలాంటి నిర్ణయం కరుణాకర్ రెడ్డి తీసుకోవడం ఏఐటియుసి సంపూర్ణంగా అభినందిస్తుందని ఆయన అన్నారు. అలాగే టిటిడిలో పనిచేస్తున్న ఇతర కార్మికుల సమస్యల పరిష్కారానికి కూడా భూమన కరుణాకర్ రెడ్డి చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. ఇదే తీరుగా ప్రభుత్వం కూడా కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ కార్మికుల సమస్యలు స్కీం వర్కర్ల సమస్యలను పరిష్కరించే దశగా ప్రభుత్వం కూడా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

## రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీలకు వడమాలపేట విద్యార్థులు

వడమాలపేట, అక్టోబరు 9 ప్రభాతవార్త:



స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ముగ్గురు రాష్ట్ర స్థాయి బాక్సింగ్‌పోటీలకు ఎంపికైనట్లు పీడీ చంద్రశేఖర్‌రాజు తెలిపారు. తిరుచానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఈ నెల 7వ తేదీ ఉమ్మడి చిత్తూరు జిల్లా స్కూలు గేమ్స్ ఆధ్వర్యంలో జరిగిన అండర్-14,17 బాల బాలికల బాక్సింగ్ పోటీల్లో వడమాలపేట విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరచారు. లోకేష్ 38 కిలోల విభాగంలో, జయసూర్య 50 కిలోల విభాగంలో మొదటి స్థానం నిలిచి రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ బాక్సింగ్ పోటీలకు ఎంపికయ్యారు. విజయనగరం జిల్లాలో ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో నవంబరులో జరిగే రాష్ట్ర స్థాయి బాక్సింగ్ పోటీల్లో వీరు పాల్గొంటారు. ప్రతిభచూపిన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు కరుణ నవనీతం, బోధన బోధనేతర సిబ్బంది అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లోను ప్రతిభ కనబరచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికవ్వాలని కోరారు. పాఠశాల విద్యార్థులను చదువుతో పాటు క్రీడల వైపు కూడా ప్రోత్సహిస్తున్న తల్లిదండ్రులకు పాఠశాల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు.

## జగనన్న ఆరోగ్య సురక్ష ఒక వరం

యంపిడిఓ రమేష్‌బాబు

చంద్రగిరి, అక్టోబర్ 9 ప్రభాతవార్త:



జగనన్న ఆరోగ్య సురక్ష ఒక వరమని ఎంపిడిఓ రమేష్‌బాబు అన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంప్ సోమవారం ఏ.రంగంపేట సచివాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. తహశీల్దార్ శిరీషా మాట్లాడుతూ బిపి, షుగర్, హెచ్‌బి, కంటి పరీక్షలు చేసుకొని ఆరోగ్యంగా వుండాలన్నారు. గర్భవతులు, చిన్నపిల్లలు సకాలంలో టీకాలు వేసుకోవాలన్నారు. ఐసిడిఎస్ ఆధ్వర్యంలో సూపర్ వైజర్ సుహాషిణి న్యూట్రీషన్ స్టాల్‌ను ఏర్పాటు చేసి రక్తహీనత, నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి బోస్ చంద్రారెడ్డి, సర్పంచ్ ఎర్రయ్య, ఎంఈఓ శ్రీవరం లలితకుమారి, కొటాల పిహెచ్‌సి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జి.శివాజీ ప్రయాగ్, డాక్టర్ రాధ, డిపిహెచ్‌ఎస్ శ్రీనివాసులు రెడ్డి, డాక్టర్ ఉమాపతి యాదవ్, ఎంపిహెచ్‌ఈఓ ఈశ్వరయ్య, పిహెచ్‌ఎన్ రమణమ్మ, పంచాయతీ కార్యదర్శి శిరీషా, తదితరులు పాల్గొన్నారు.


**CHITTOOR URBAN DEVELOPMENT AUTHORITY CHITTOOR**

Roc.No:108/2022/CHUDA Dated : 09.10.2023

**E-procurement Tender Notice**

Tenders are invited from eligibile contractors for **1 No.** work under CHUDA Funds 2023-24 for **Rs.10.00 Lakhs** on e-procurement by under signed.

| Sl.No | Bid down loading starting date and time | Last date & time for receipt of Bids |
|---|---|---|
| 1 | 10.10.2023 @4.00 PM | 27.10.2023 @ 3.00 PM |

Further details contact at 9490981057 during the office hours on all working days. Sd/- P. Viswanath, Vice-Chairperson, CHUDA

# లిడ్ క్యాప్ భూములను పరిరక్షించండి

## జిల్లా కలెక్టర్‌కు మాదిగ లిడ్ క్యాప్ భూముల పరిరక్షణ కమిటీ వినతి



కలెక్టర్‌కు అర్జీ సమర్పిస్తున్న లిడ్ క్యాప్ భూముల పరిరక్షణ కమిటీ సభ్యులు

తిరుపతి రవాణా, అక్టోబర్ 9 ప్రభాతవార్త : దామినేడు లెక్క దాఖలా సర్వే నెంబర్ 71, 71/2, 72/3, 101/2 సర్వే నెంబర్లలోని 5 ఎకరాల భూమిని ఆక్రమించడానికి కొందరు ప్రయత్నిస్తున్నారని, ఆ భూములు చుట్టూ ఫెన్సింగ్ లేదా గోడ నిర్మించాలని తిరుపతి జిల్లా కలెక్టర్‌ను మాదిగ లిడ్ క్యాప్‌భూముల పరిరక్షణ కమిటీ నాయకులు, వివిధ దళిత సంఘాల నేతలు కోరారు. సోమవారం జిల్లా కలెక్టర్ నిర్వహించిన స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను వారు కలిసి భూ కబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలని వినతి పత్రం అందజేసారు. ఈ సందర్భంగా లిడ్ క్యాప్ భూముల పరిరక్షణ కమిటీ చైర్మన్ పి. సుబ్బయ్య మాట్లాడుతూ 1978 – 1979 సంవత్సరంలో తిరుపతి రెవెన్యూ డివిజన్ పరిధిలోని మాదిగ చర్మ కార్మికుల కోసం చెప్పులు తయారీకి చర్మకారుల సంస్థను ఏర్పాటు చేశారన్నారు. ఈ ఐదు ఎకరాల భూమిలో ఎవరు ప్రవేశించకుండా చుట్టూ ఫెన్సింగ్ రాళ్ళు నాటి ఫెన్సింగ్ వేశారన్నారు. ఏపిఐఎసి అధికారులు దామినేడు చెరువుకు ఉత్తర భాగాన బెడ్ పోరంబోకులో దిమ్మెలు కూడా కట్టారని తెలిపారు. మాదిగ మహాజన సంఘం రాష్ట్ర అధ్యక్షులు కె. సుధాకర్ బాబు మాట్లాడుతూ 2018లో ఈ స్థలాన్ని కబ్జా చేయడానికి కొందరు ప్రయత్నిస్తే దీనిపై జిల్లా కలెక్టర్ ఆర్డిఓ, తహశీల్దారులను కలిసి వాస్తవాలను వివరించి కబ్జా కాకుండా ఆ భూమిని పరిరక్షించుకున్నామని తెలిపారు. అయితే గిరిధర్ మురారి, గోవిందరాజులు తమ అనుచరులతో ఈ నెల మూడవ తేదీన ఆ భూమిని ఆక్రమించుకోవడానికి ప్రయత్నించారన్నారు. ఎస్సి, ఎస్టి యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గౌడ పేర చిట్టిబాబు మాట్లాడుతూ లిడ్ క్యాప్ పరిశ్రమ చుట్టూ నాటి ఉన్న ఫెన్సింగ్ రాళ్ళను పగలగొట్టారని జెసిబితో చదును చేస్తుండగా తాము అడ్డుకోవడం జరిగిందన్నారు. ఇప్పటికే వీరు అనేక చోట్ల భూముల ఆక్రమణలకు పాల్పడ్డారని ఆయన తెలిపారు. వీరిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. దీనిపై సానుకూలంగా స్పందించిన జిల్లా కలెక్టర్ వెంటనే తిరుపతి రూరల్ ఎంఆర్ఓ సుబ్రమణ్యంకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. లిడ్ క్యాప్ భూముల చుట్టూ ఫినిషింగ్ చేయాలని తెలిపారు. దీనిపై నాయకులు హర్షం వ్యక్తం చేసారు. ఈ కార్యక్రమంలో లిడ్ క్యాప్ భూముల పరిరక్షణ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎస్ గంగాధరం, మాదిగ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. వాలముని, ఎమ్మార్పిఎస్ నాయకుడు ఈ. ఆదయ్య, డప్పు కళాశాల సంఘం నాయకులు గాంధీ, కృష్ణ, రవికుమార్, కాటయ్య, మునిరాజా, పెంచలయ్య, కరాటపు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## గణనాథుని లడ్డు ధర రూ 1.28 లక్షలు



కాణిపాకం, అక్టోబర్ 9 ప్రభాతవార్త: కాణిపాకం దేవస్థానంలో బ్రహ్మోత్సవ మహా లడ్డు 1.28 లక్షల రూపాయలు ధర పలికింది. ప్రతి ఏటా బ్రహ్మోత్సవాల సందర్భంగా సా ్వమివారి మహా ప్రసాదం లడ్డును ఉత్సవాల చివరి రోజు బహిరంగ వేలం వేస్తుంటారు. 21 రోజులు పాటు జరిగే సా ్వమివారి బ్రహ్మోత్సవాలకు ప్రతీకగా 21 కిలోల బరువు గల లడ్డూను వేలం వేస్తారు. ఈమేరకు ఈఏడాది కూడా 21 కిలోల లడ్డూను ఆదివారం తెప్పోత్సవం పూర్తయిన అనంతర ం స్థానిక ఆస్థాన మండపంలో ఆలయ అధికారులు బహిరంగ వేలం వేయడానికి సిద్ధం చేశారు.అయితే వేలంపాటల్లో పాల్గొనేందుకు భక్తులు తక్కువగా రావడంతో వేలం పాటను వాయిదా వేసి సోమవారం లడ్డూ వేలం నిర్వహించారు. ఈసందర్భంగా అగరంపల్లెకు చెందిన చరణ్‌రెడ్డి అనే భకు_డు 1.28 లక్షల రూపాయలకు అత్యధిక పాటదారుడుగా లడ్డును దక్కి ంచుకున్నారు. గత ఏడాది ఈమహా లడ్డు రికార్డు స్థాయిలో 3.70 లక్షల రూపాయలు ధర పలకడం గమనార్హం. అయితే ఈఏడాది అతి తక్కువగా 1.28 లక్షల రూపాయలు మాత్రమే ధర పలికింది. ఈవేలం పాటల్లో దేవస్థానం ఏఈఓలు రవీంద్రబాబు, ఎస్వీ ్వ.కృష్ణారెడ్డి, హరి మాధవరెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, హేమమాలిని, సూపరెండెంట్‌లు కోదండపాణి, శ్రీదర్‌బాబు, రవి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ సురేష్, ఆలయ మాజీ చైర్మన్ జగన్నాధరెడ్డి, స్థానిక మాజీ సర్పంచ్ మధుసూధన్‌రావు, సురేష్‌రెడ్డి, మోహన్‌బాబులతో పాటు భక్తులు పాల్గొన్నారు.

## శివయ్యసేవలో విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి



శ్రీకాళహస్తి,అక్టోబర్ 9 ప్రభాతవార్త : రాష్ట్రఉన్నత విద్య ప్రిన్సిపల్ కార్యదర్శి శ్యామల రావు కుటుంబ సభ్యులతో స్వామి అమ్మవార్ల సేవలో పాల్గొన్నారు. సోమవారం ఆయన రాగా వారికి ఆలయ ఇఓ కె.వి.సాగర్‌బాబు సూచనలతో దక్షిణగోపురం వద్ద స్వాగతం పలికారు. వేదపండితుల వేద మంత్రాలతో, మేళ తాళాలతో స్వాగతం పలికారు. ఆయనకు సూపరిటెండెంట్ పార్థ సారధి, నాగభూషణం యాదవ్, ఏపిఆర్ఓలు పార్థసారధిరెడ్డి, గోపాల్‌లు స్వాగతం పలికారు.స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం చేసుకున్న వారికి గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేదపండితులతో ప్రత్యేకాశీర్వచనాలు అందించారు.స్వామి అమ్మవార్ల శేష వస్త్రాలను అందించారు.

## సంత్ శ్రీ హాథీరాం బావాజీ మఠానికి రక్షణ కరువు

### అఖిల భారత్ బంజారా సేవా సంఘ్ జాతీయ అధ్యక్షులు బాబురావు చౌహాన్



తిరుపతి (మహిళావర్సిటి), అక్టోబర్ 9 ప్రభాతవార్త : సంత్ శ్రీ హాథీరాం బావాజీ మఠానికి రక్షణ కరువైం దని అఖిల భారత బంజారా సేవా సంఘం అధ్యక్షులు బాబు రావు చౌహాన్ పేర్కొన్నారు. సోమవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత దేశ వ్యాప్తంగా బంజారాలు సుమారుగా 15 కోట్ల జనాభ కలిగి వున్నారు. బంజారా సంతతికి చెందిన సంత్ శ్రీ హాథీరాం బావాజీ మఠంలో ఎన్నో కుంభ కోణాలు జరుగుతున్నదన్నారు. మఠం ఆస్తులు అన్నిను కూడా ఎక్కడికక్కడ అన్యాక్రాంతం అవుతున్నదని అన్నారు. న్యూ డిల్లీ హోదాలో ఈ నెల 8 వ తేది నుంచి 10వ తేది వరకు సంత్ శ్రీ హాథీరాం బావాజీ మఠం తిరుమల, తిరుపతిని పర్యవేక్షించడానికి వచ్చారన్నారు. ఈ నెల 8వ తేది గిరిజన భవన్‌లో కూడా బంజారాలచే సమావేశాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వాస్తవంగా మఠం నిర్వీరంగా వున్నది. మఠాన్ని రక్షించాల్సిన అవసరం ఎంతైన వున్నదని భావిస్తున్నట్లు తెలిపారు. హాథీరాం బావాజీ మఠం ఆస్తులను రక్షించాలి, బంజారాల సాధువులను బంజారా భక్తులకు ఇక్కడ సౌకర్యాలను కల్పించాలన్నారు. బంజారాలతో ఒక ధార్మిక పరిషత్‌ను ఏర్పాటు చేయాలని తాను ప్రభుత్వానికి డిమాండ్ చేసారు.

## బోయకొండ దసరా ఉత్సవాలకు కలెక్టర్‌కు ఆహ్వానం



చిత్తూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త: శ్రీ బోయకొండ గంగమ్మ దేవస్థానం దసరా మహోత్సవాలు పురస్కరించుకొని ఈ నెల 15 నుండి 23వ తేదీ వరకు జరిగే మహోత్సవాలకు కలెక్టర్ సగిలి షన్మోహన్‌ను బోయకొండ దేవస్థానం ఇఓ బి.చంద్రమౌళి, దేవాదాయ శాఖ సహాయ కమీషనర్ ఏకాంబరంలు ఆహ్వానించారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో కలెక్టర్ సగిలి షన్మోహన్‌ను కలిసిన వీరు అమ్మవారి ప్రసాదాలు, బోయకొండ బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. అలాగే జాయింట్ కలెక్టర్ పి.శ్రీనివాసులు, డిఆర్ఓ రాజశేఖర్‌లను సైతం వీరు బోయకొండ దసరా బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను అందించి ఆహ్వానించారు.

## ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టండి : సిపిఎం డిమాండ్



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 9 ప్రభాతవార్త : స్పందన కార్యక్రమంలో వందలాది మంది ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం అర్జీలు ఇస్తున్న ప్పటికీ పరిష్కారం మాత్రం ఉండడం లేదని సిపిఎం పార్టీ డిమాండ్ చేసారు. జిల్లా స్థాయి అధికారులు సమస్యలు పరిష్కరించమని తహశీల్దారుకు, సంబంధిత శాఖలకు, అధికారులకు అర్జీలు పంపుతు న్నప్పటికీ ఆన్‌లైన్‌లో నమోదు అవుతున్నప్పటికీ పరిష్కారం మాత్రం ఉండడం లేదు. పెళ్లకూరు మండలం నెలబల్లి రెవిన్యూ అక్కగారిపేట దళితుల భూములు నేషనల్ హైవేకి తీసుకున్నప్పటికీ వారిలో ఐదు మందికి పరిహారం చెల్లించక భూములు చూపక గత రెండు సంవత్సరాలుగా ఆఫీసుల చుట్టూ తిప్పుకోవడం చూస్తుంటే ఈ విషయం స్పష్టమవుతుంది. ఇదే విషయంపై బాధితులు జిల్లా కలెక్టర్‌కి అర్జీల సమర్పించడం జరిగింది. పలు సమస్యలపై జిల్లా కలెక్టర్‌కి తెలియజేయడం జరిగింది. కలెక్టర్ కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తూ సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి. హేమలత, సంక్రాంతి వెంకటయ్య, రాపూర్ సుబ్రమణ్యం, సత్యశ్రీ రాజా శివానందం, గోపి, గోవిందు, జయంతి తదితరులు పాల్గొన్నారు.

## తమ స్థలాలను శుభ్రం చేయించుకోవాలి : కమిషనర్ హరిత



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 9 ప్రభాతవార్త : తిరుపతి నగరంలో ఖాళీ స్థల యజమానులు తమ స్థలాలను శుభ్రం చేయించుకోవాలని కమిషనర్ హరిత పేర్కొన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ కమిషనర్, అర్జీలు స్వీకరించే స్పందన కార్యక్రమంలో కమిషనర్ హరిత అర్జీలను స్వీకరించారు. కొర్లగుంట మారుతీనగర్ నుండి వచ్చిన ఒక ఫిర్యాదులో తమ ఇంటి పక్కన వున్న ఖాళీ స్థలంలో చెత్త వేస్తున్నారని అందువలన పాములు, పురుగులు వస్తున్నాయనే పిర్యాధుపై కమిషనర్ స్పందిస్తూ తమ సిబ్బంది పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. సోమవారం డయల్ యువర్ కమిషనర్‌కు 29, స్పందనకు 33 ఫిర్యాదులు అందాయి. డ్రైనేజీ, మురికినీటి, కుక్కల సమస్యలు తదితర సమస్యలపై వచ్చిన ఫిర్యాదులపై కమిషనర్ స్పందిస్తూ ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకుని సకాలంలో పరిష్కరించాలని కమిషనర్ హరిత ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈ మోహన్, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు కెఎల్ వర్మ, సేతుమాధవ్, సెక్రటరీ రాధిక, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అన్వేష్ రెడ్డి, సిటీ ప్లానింగ్ అధికారులు శ్రీనివాసులు రెడ్డి, బాలసుబ్రమణ్యం, వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ నాగేంద్ర రెడ్డి, మేనేజర్ చిట్టిబాబు, సర్వేయర్ దేవానంద్, సూపరింటెండెంట్లు, డిఈలు, ఆర్ఐలు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# వ్యవస్థలను సర్వనాశనం చేసిన జగన్‌రెడ్డి

-ఒక్క ఛాన్స్‌తో రాష్ట్రాన్ని దోచేశారు. మాజీ ఎంఎల్‌ఏ



రిలేదీక్షలో పాల్గొన్న మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు, టిఎన్‌యస్‌ఎఫ్‌నాయకులు

శ్రీకాళహస్తి, అక్టోబర్ 9 ప్రభాతవార్త : రాష్ట్రంలో వ్యవస్థలను నాశనం చేసి రాష్ట్రాన్ని ఒక్క ఛాన్స్ అన్న పేరుతో పూర్తిగా దోచుకున్న జగన్‌రెడ్డికి, వారి మంత్రులు, ఎంఎల్ఏలు త్వరలోనే జైలుకు వెళ్ళాల్సి వస్తుందని మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు అన్నారు. తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు మాజీ ముఖ్యమంత్రిపై అక్రమ కేసులకు నిరసనగా పార్టీ కార్యాలయంలో టిఎన్‌యస్‌ఎఫ్ నియజకవర్గ ప్రధాన కార్యదర్శి హేమంత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన రిలేదీక్షకు ఆయన హాజరయ్యారు. ఆయనతోపాటు రాష్ట్ర కార్యదర్శులు గాలిచలపతినాయుడు, రెడ్డివారిగురవారెడ్డి, దశరధాచారి, స్కిట్ మాజీ ఛైర్మన్ వంజవాకం గురువధశరధన్, మాజీ ట్రస్టుబోర్డు సభ్యుడు నారాయణయాదవ్‌లు హాజరయ్యారు. ఈసందర్భంగా మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు మాట్లాడుతూ 14సంవత్సరాలు సుధీర్ఘ ముఖ్య మంత్రిగా ఉన్న చంద్రబాబునాయుడుపై ఎలాంటి సాక్ష్యాధారాలు లేకుండా అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. ఒక్క ఛాన్స్ పేరుతో తల్లివిజయమ్మ, చెల్లి షర్మిలను అడ్డుపెట్టుకుని గెలిచిన జగన్‌రెడ్డి నేడు ఇద్దరినీ గెంటివేసిన దుర్మార్గుడయ్యాడని దుయ్యబట్టారు. నేడు రాష్ట్రంలో ప్రభుత్వం పోలీసు వ్యవస్థను అడ్డం పెట్టుకుని పరిపాలన సాగిస్తున్నారని వారు కూడా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదన్నారు. త్వరలోనే సిఎంతో పాటు వారి మంత్రులు, ఎంఎల్ఏలకు త్వరలోనే శ్రీకృష్ణ జన్మస్థానం తప్పదన్నారు. టిఎన్‌యస్‌ఎఫ్ నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి పాల్వాయి హేమంత్ రాయల్ మాట్లాడుతూ తనను కోరి ఎన్నుకున్న రాష్ట్ర ప్రజానీకం యొక్క బాగోగులు చూడాల్సిన ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌రెడ్డి తన ప్రత్యర్ధులను అణచివేయడానికి ప్రకృతి సందను దోచుకుని తనవారికి కట్టబెట్టి రాజ్యాంగ వ్యవస్థలను కబళిస్తున్నాడని ఆరోపించారు. రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో వ్యవస్థ భ్రస్టుపట్టిపోయిందని రాష్ట్రం మళ్ళీ రామరాజ్యంగా రావాలంటే చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా రావాలని కోరారు. అనంతరం దీక్ష చేస్తున్న వారికి నిమ్మరం ఇచ్చి మాజీ ఎంఎల్ఏ దీక్షను విరమింపచేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శులు దశరధాచారి, గాలి చలపతి నాయుడు, మిన్నల్‌రవి, సుబ్బయ్య, తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షుడు గాలి మురళీ నాయుడు, గోపినాథ్, రేణుకాదేవి, నెమళ్ళూరుసుబ్రమణ్యం, ప్రకాష్‌నాయుడు, కాసరం రమేష్, వాకచర్ల గుర్రప్పశెట్టి, డాక్టర్ ఉమేష్‌రావు, నెమళ్ళూరుసుబ్రమణ్యం, గోగినేని భాస్కర్ నాయుడు, జానకిరామా నాయుడు, విజయకుమార్, హరినాయుడు, పూల ఆనంద్, వెంకటేశ్వరచౌదరి, డి.వి.నారాయణ, ఖాదర్‌బాషా, మునిరాజయాదవ్, ప్రసాద్‌నాయుడు, బషీర్, కిషోర్, బాలాజీరెడ్డి, పోలూరుశ్రీనివాసులురెడ్డి, ఎంఎస్‌రెడ్డి, డిల్లీబాబు, యాదగిరి, రామచంద్రయ్య, వంకాయలసిద్దులయ్య, గణేష్, అస్మత్, షఫి, టియన్‌ఎస్‌ఎఫ్ నాయకులు వేలూరు విఘ్నేష్, ఉలసాసుజిత్, పవన్, గణేష్, జీవా, షౌకత్, అమర్‌నాథ్, రోషిత్, లక్ష్మినాథ్, డిల్లీ, జగదీష్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

## ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలి..?

### -జగనన్న అవసరాన్ని ప్రజలకు తెలపాలి -విజయవాడలో మంత్రి పెద్దిరెడ్డి

పుంగనూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త : ఎందుకు ఆంధ్రాకి జగనే కావాలని ప్రజల్లోకి వెళ్ళాలని రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నాయకులకు దిశానిర్ధేశం చేసారు. విజయవాడలోని బందరురోడ్డులో గల ఇందిరాగాంధీ స్టేడియంలో వైఎస్సార్‌సిపి ప్రతినిధుల సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మంత్రి పెద్దిరెడ్డి పుంగనూరు, చౌడేపల్లి ప్రజాప్రతినిధులు, మండల నాయకులకు సూచనలిచ్చారు. రాష్ట్రానికి వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండటం ఎంత అవసరమో గ్రామాల్లోకి వెళ్ళి ప్రజలకు వివరించాలని పిలుపునిచ్చారు. తేదేపా ప్రభుత్వం ఉన్న సమయంలో ప్రజలకు వారు చేసిన మోసాలు, ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడం వంటికి గడపగడపకూ వెళ్లి తెలియజేయాలన్నారు. వైకాపా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కరోనా కష్టకాలంలోనూ ప్రజా సంక్షేమ పథకాలు ఆపకుండా ప్రజలను బిడ్డల్లా చూసుకొన్న ఘనత వైఎస్.జగన్మోహన్‌రెడ్డికి దక్కిందని వివరించాలన్నారు. ప్రజల్లోకి తీసుకెళ్ళి పార్టీ విజయానికి కృషి చేయాలని పుంగనూరు నాయకులను ఆదేశించారు. మండల స్థాయిలో వివిధ పదవుల్లో వున్న వారందరూ ఎందుకు ఆంధ్రాకి జగన్ కావాలి అనేది ప్రజలకు వివరించాలన్నారు. ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేసి రాబోయే ఎన్నికల్లో వైకాపా విజయకేతం ఎగరేసి వైఎస్.జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చేయాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం మండల నాయకులు మంత్రి పెద్దిరెడ్డి నివాసంలో చౌడేపల్లి మండల సమస్యలపై చర్చించారు. రాష్ట్ర దృశ్యకళలు అకాడమీ సభ్యుడు, మండల వైకాపా అధ్యక్షుడు కూరపర్తి అంజిబాబు, ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, నరసింహులుయాదవ్, హెచ్‌డిఎస్ ఛేర్మన్ కళ్యాణభరత్, లక్ష్మీపతి, పుంగనూరు నియోజకవర్గానికి చెందిన ప్రజాప్రతినిధులు, వైకాపా నాయకులు పాల్గొన్నారు.

## కోటపోలూరులో విశ్వహిందూ పరిషత్ రథం



సూళ్లూరుపేట, అక్టోబర్ 9 ప్రభాతవార్త : సూళ్లూరుపేట మండలం కోటపోలూరు గ్రామానికి విశ్వహిందూ పరిషత్‌కు చెందిన ప్రచార రథం సోమవారం చేరుకుంది. ఈ రథం సూళ్లూరుపేట, దొరవారిసత్రం, తడ మండలాల్లో తిరుగుతుంది. ఈ రథం ద్వారా హిందూ ధర్మం గురించి ప్రజలకు వివరిస్తారు. ఈ ప్రచార రథాన్ని విశ్వ హిందూ పరిషత్ స్థాపించి 60 సంవత్సరాలైన సందర్భంగా దేశ వ్యాప్తంగా ప్రతి గ్రామాన్ని కలుస్తూ శౌర్య జాగరణ రథ యాత్ర పేరుతో కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఈ ప్రచార రథాన్ని ఆరణి విజయభాస్కర్‌రెడ్డి ప్రారంభించారు. మంగళవారం దొరవారిసత్రం, తడ మండలాల్లో రథయాత్ర కొనసాగుతుందని జిల్లా విశ్వహిందూ పరిషత్ ఉపాధ్యక్షుడు సూరా కమ్మిరెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముని యుగంధర్, జగదీష్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మ గుడికి రూ. 50 వేలు విరాళం



చిల్లకూరు, అక్టోబర్ 9 ప్రభాతవార్త : చిల్లకూరు గ్రామానికి చెందిన నందవరం చిన్నస్వామి శెట్టి, కాంతమ్మ, నందవరం నాధమునిశెట్టి, వసంతమ్మ దంపతులు జ్ఞాపకార్ధం నందవరం సుబ్బారావు కుమారుడు వెంకటసాయి చిల్లకూరు గ్రామంలోని నూతనంగా నిర్మిస్తున్న గంగమ్మ గుడికి వెంకటసాయి తొలి జీతం 50 వేల రూపాయిలను విరాళంగా అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి గంగమ్మ గుడి నిర్మాణానికి సహాయ సహకారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో నందవరం సుబ్బారావు శ్రీమతి శ్రీ ప్రియ, దేవస్థానం కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యలకు తక్షణ చర్యలు : ఎస్పి పరమేశ్వర రెడ్డి

తిరుపతి క్రైం, అక్టోబర్ 9, ప్రభాతవార్త : స్పందన కార్యక్రమం ద్వారా వచ్చిన సమస్యలకు తక్షణ చర్యలు చేపడుతామని ్ర ఎస్పి పరమేశ్వర రెడ్డి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో స్పందన కార్యక్రమంలో జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించి, సమస్యలకు సానుకూలంగా స్పందించి, ప్రతి ఒక్కరి కేసు విషయాలను ఖుశలంగా అడిగి తెలుసుకుని సంబంధిత పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం తెలిపి స్పందన ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించి న్యాయం చేయాలని ఎట్టి పరిస్థితుల్లో కూడా స్పందన ఫిర్యాదుల పట్ల అలసత్వం వహించకూడదని పోలీస్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కుటుంబ కలహాలు, ఆర్థిక పరమైన నేరాలు, ఆస్తి తగాదాలు, ఇతరత్రా కారణాలతో ప్రజలు ఫిర్యాదులు చేసారు. ఈ కార్యక్రమం ద్వారా జిల్లా ఎస్పి కార్యాలయానికి జిల్లా నలుమూలల నుండి సుమారు 102 మంది వచ్చి వారి సమస్యలను స్పందన ద్వారా విన్నవించుకున్నారు. స్పందన కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదులన్నింటిపై చట్ట ప్రకారం విచారణ జరిపి, నిర్దేశించిన గడువు లోపు ఫిర్యాదుదారుల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడం జరుగుతుందన్నారు. సుదూర ప్రాంతాల నుండి ప్రయాసపడి ఎస్పి కార్యాలయానికి రాలేని వృద్ధులు, మహిళలు వారి పరిధి పోలీస్ స్టేషన్ల నందు ఫిర్యాదు చేయవచ్చని వాటిని కూడా స్పందన ఫిర్యాదు లాగానే పరిగణించి, పరిష్కరించడం జరుగుతుందన్నారు.

## ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో...

### ఉపగ్రహాలు, రాకెట్ల ప్రదర్శన చేసిన శాస్త్రవేత్తల బృందం



వరదయ్యపాలెం, అక్టోబర్ 9 ప్రభాతవార్త : వరదయ్యపాలెం మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపగ్రహాలు, రాకెట్ల ప్రదర్శన ఇస్రో శాస్త్రవేత్తల బృందం నిర్వహించారు. ఈ నెల 4వ తేది నుండి 10వ తేది వరకు ప్రపంచ అంతరిక్ష వారం సంబరా లను నిర్వహించారు. ఇందులో భాగంగానే జిల్లా స్థాయి సైన్సు ఉత్సవాన్ని గ్రామీణ ప్రాంతమైన వరదయ్యపాలెం జిల్లా పరిషత్ పాఠశాలలో నిర్వహిస్తుండడం గమనార్హం. ఈ సందర్భంగా బాల మురళి (షార్ డిప్యూటీ జనరల్ మేనేజర్) విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ ఒక లక్ష్యాన్ని పెట్టుకోవాలని, ఏ పట్టణాలకు, పరిమితం కాకుండా గ్రామీణ ప్రాంత స్థాయి నుండి మీలోని నైపుణ్యం గుర్తించి పూర్తిగా అన్ని విధాల సహాయ సహకారాలు అందించే వాతావరణ సొసైటీలో ఉందని, ప్రస్తుతం పుష్కలంగా అవకాశాలు ఉన్నాయి. పోటీ ప్రపంచంలో పోటీ పడుతుందని ప్రపంచం మన దేశం వైపు చూస్తుందని ఈ దేశ సంపద విద్యార్థులు యువకులేనని వచ్చే ఏ చిన్న అవకాశాన్ని కూడా వదులు కోకుండా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రమణయ్య, ఎంఈఓ, వ్యాయామ ఉపాధ్యాయులు, బందిల కుమార్ తదితర టీచర్లు పాల్గొన్నారు.

## బాబుకోసం మేము సైతం కార్యక్రమంలో సుధీర్‌రెడ్డి



తొట్టంబేడు, అక్టోబర్ 9 ప్రభాతవార్త : బాబు కోసం మేము సైతం కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని లింగమనాయుడుపల్లి పంచాయతీ దొమ్మరమిట్ట మరియు దాసరిమిట్ట గ్రామాల్లో పర్యటిస్తూ తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారాచంద్రబాబునాయుడుపై అక్రమ అరెస్టులను నిరసిస్తూ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి ఇంటింటికి కరపత్రాలను పంపిణీచేస్తూ ప్రజలతో మమేకమై లక్షకోట్లు తిన్న రాబంధును దర్జాగా తిరుగుతున్న పోలీసు యంత్రాంగం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తోందన్నారు. రాజకీయ నాయకులకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం వత్తాసు పలకడం ఎంత వరకు సమంజసం అని సుధీర్‌రెడ్డి తెలిపారు. చంద్రబాబు నాయుడును జైలులో పెట్టినంతమాత్రాన ప్రజాదరణ రోజురోజుకు రాష్ట్రంలోనే కాకుండా ప్రపంచ దేశాల్లో మచ్చలేని మహ నీయుడుగా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఇది అభినందించాల్సిన విషయం అన్నారు. 74 సంవత్సరాల వయస్సులో ప్రజల కోసం ఆరాట పడుతూ ఉంటే జగన్‌రెడ్డి ఓర్వలేక ఓటమి భయంతో అక్రమ కేసలు పెట్టి అణచి వేయాలని చూస్తున్నారన్నారు. అతి త్వరలోనే చంద్రబాబు నాయుడు ఆణిముత్యంగా తిరిగి వచ్చి సిఎం పీఠాన్ని ఎక్కడం తథ్యం అన్నారు. కార్యమ్రాన్ని ఘట్టమనేని శంకరనాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి గాలిచలపతినాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు గాలిమురళీనాయుడు, క్లస్టర్ ఇన్‌ఛార్జి మునిరాజనాయుడు, మాజీ మార్కెట్ కమిటీ ఛైర్మన్ రంగినేని చెంచయ్యనాయుడు, టిఎన్టీయుసి మండల అధ్యక్షుడు చింతగింజల సునీల్, నాయకులు వినోద్, పాపయ్య, చిన్నరంగయ్య, రమణయ్య, గంధంశ్రీనివాసులు, సాయినాయుడు, వినయ్, ప్రవీణ్‌చౌదరి, మాజీ ఆయకట్టు అధ్యక్షులు ఉన్నంగోవర్ధన్‌నాయుడు, మాజీ ఎంపిటిసి విజయకుమార్‌నాయుడు, శివ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## హోంగార్డ్ కుటుంబ సభ్యులకు చేయూతనిచ్చి ఆదుకున్న సహచర సిబ్బంది

తిరుపతి క్రైం, అక్టోబర్ 9 ప్రభాతవార్త : ఇటీవల కాలంలో అనారోగ్యం కారణాలతో మరణించిన హెచ్‌జి 1486 నరేష్ బాబు భార్య శ్యామలా దేవికి సోమవారం పోలీసు ప్రధాన కార్యాలయం నందు జరిగిన కార్యక్రమంలో కారుణ్య నియామకాల కింద హోంగార్డుగా ఉద్యోగం ఇప్పించి నియామక ఉత్తర్వుల పత్రాలను జిల్లా ఎస్పి పరమేశ్వర రెడ్డి అందించి తన మానవత్వాన్ని చాటుకున్నారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన హోంగార్డ్ కుటుంబ సభ్యులకు సహచర హోంగార్డులందరూ ఒక్క రోజు వేతనాన్ని ఆర్థిక సహాయంగా అందించి, తమ ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. కష్టకాలంలో ఉన్న దివంగత హోంగార్డు కుటుంబాన్ని ఆదుకోవాలనే సదుద్దేశంతో జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డులందరూ ఒక్కరోజు వేతనాన్ని ఇచ్చారు. అనంతరం జిల్లాలోని 17 మంది హోంగార్డులు సమర్పించిన వైద్య ఖర్చుల బిల్లులను పరిశీలించి వారికి జిల్లా హోంగార్డు వెల్ఫేర్ ఫండ్ నుంచి మంజూరైన రూ. 95 వేలు చెక్కులను అందజేసారు. అందులో దొరస్వామి,మునస్వామి ఇద్దరు హోంగార్డులకు 10,000 రూపాయిలు చొప్పున, కిశోర్, శరత్ బాబు, చిరంజీవి, రమాదేవి, రాజారెడ్డి, లక్ష్మీప్రసాద్, గుర్రప్ప, లక్ష్మీనారాయణ, గోపాల్ రెడ్డి, సుధాకర్, కృష్ణమూర్తి, అనిల్, సురేష్, సతీష్, కిరణ్ కుమార్ ఈ 15 మంది హోంగార్డులకు 5 వేలు రూపాయిలు చొప్పున చెక్కులను అందజేసారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పిలు వెంకట్రావు పరిపాలన, విమల కుమారి క్రైం, కులశేఖర్ ఎల్అండ్ఓ, హోంగార్డ్సు డిఎస్పి లక్ష్మణ కుమార్, డిఎస్‌డబ్ల్యూ ఆర్ఐ చలపతి, ఆర్ఎస్ఐలు, హెచ్1 క్లర్క్ అనుదీప్, వెల్ఫేర్ చార్లెస్ బాబు, హోంగార్డులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.